

కూలిన క్రేన్



క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది




రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త


# క్రేన్ కూలి ముగ్గురు కార్మికులు మృతి

- పదిమందికి తీవ్ర గాయాలు
- మృతుల సంఖ్య పెరిగే అవకాశం
- అకస్మాత్తుగా వీచిన భారీ గాలుల ధాటికి నియంత్రణ కోల్పోయిన క్రేన్
- శంకర్‌పల్లిలో విషాదం
- సహాయక చర్యలు ముమ్మరం

**శంకర్‌పల్లి, ఏప్రిల్ 27, ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలంలో సోమవారం మధ్యాహ్నం ఘోర ప్రమాదం సంభవించింది. ప్రముఖ నిర్మాణ సంస్థ ఎన్.సీ.సీ లిమిటెడ్ ప్రాజెక్ట్ పనుల్లో భాగంగా వినియోగిస్తున్న ఒక భారీ క్రేన్ ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ విషాద ఘటనలో ముగ్గురు కార్మికులు ప్రాణాలు కోల్పోగా, మరో పదిమంది తీవ్రంగా గాయపడ్డారు.

మధ్యాహ్నం సుమారు 2:30 గంటల సమయంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. తీవ్రమైన ఈదురుగాలులు వీయడంతో, ఆ గాలుల ధాటికి భారీ క్రేన్ తన నియంత్రణను కోల్పోయి నేలకూలింది. భద్రతా ప్రమాణాల కోసం క్రేన్‌కు లాకింగ్ వ్యవస్థ ఉన్నప్పటికీ, ప్రకృతి వైపరీత్యం తరహాలో వచ్చిన గాలి వేగానికి అది ఆగలేకపోయిందని ప్రాథమిక సమాచారం. ప్రమాదం జరిగిన వెంటనే కంపెనీ యాజమాన్యం మరియు స్థానికులు అప్రమత్తమై సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన పదిమందిని వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. వీరిలో పలువురి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని వైద్య వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

కూలిపోయిన క్రేన్ శిథిలాల కింద ఇంకా ఎవరైనా చిక్కుకున్నారా అనే కోణంలో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

మృతి చెందిన వారితోపాటు క్షతగాత్రులు అంతా ఎక్కువగా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారు కావడంతో, వారి కుటుంబాలు రోడ్డున పడకుండా తగు సహాయం అందిచాలని స్థానికులు కోరుతున్నారు. యాజమాన్యం వెంటనే స్పందించి సహాయక చర్యలను ప్రారంభించింది. గాయపడిన వారికి తక్షణ వైద్యం అందించడమే కాకుండా, సంఘటనా స్థలంలో రక్షణ చర్యలను వేగవంతం చేసింది.

నీరునీరో అంటున్న జనం

# నీరో తరహాలో అధికార గణం

**వేసవి ఎండలు మండిపోతున్న తరుణంలో పెద్దేముల్ మండలంలోని పలు గ్రామాల్లో గత ఆరు రోజులుగా మిషన్ భగీరథ నీరు అందక ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. కలెక్టర్ ఆదేశాలు ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కరువవడంతో మహిళలకు కష్టాలు తప్పటం లేదు.**

▶ఆరు రోజులుగా మిషన్ భగీరథ నీళ్ళు బంద్ ▶పెద్దేముల్ మండలంలో బిందెలతో రోడ్డెక్కిన మహిళలు ▶ అధికారుల నిరక్ష్యంపై ప్రజాగ్రహం

**పెద్దేముల్, ఏప్రిల్ 27 ప్రభాతవార్త:** దేవుడు వరమిచ్చిన పూజారి అడ్డుకున్నట్లు ఉంది పెద్దేముల్ మండలంలో మిషన్ భగీరథ పథకం పరిస్థితి. ఇంటింటికీ తాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కోట్లు ఖర్చు చేసినప్పటికీ, అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల ఆ పథకం నీరుగారిపోతోంది. గత ఆరు రోజులుగా మండలంలోని పలు గ్రామాలకు మిషన్ భగీరథ నీరు సరఫరా కాకపోవడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు.

మండలంలోని మంబాపూర్, రుక్మాపూర్, కందనెల్లి, దుర్గాపూర్, రెగొండి, చైతన్యనగర్ తదితర గ్రామాల్లో నీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. మండుటెండల్లో గుక్కెడు నీటి కోసం కిలోమీటర్ల మేర నడవాల్సి వస్తోందని, మహిళలు మళ్ళీ పాత రోజుల్లాగా బిందెలతో బావుల వద్దకు, బోర్ల వద్దకు పరుగులు తీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యామ్నాయంగా ఇతరుల బోరు మోటార్లను ఆశ్రయిస్తున్నప్పటికీ, అక్కడ కూడా గంట సేపు మాత్రమే నీరు వచ్చి మోటార్లు ఆగిపోతుండటంతో పరిస్థితి మరింత దయనీయంగా మారింది.

**పైపులైన్లు లీకవుతున్నా..**

వేసవి తీవ్రత దృష్ట్యా తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని జిల్లా కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ, సంబంధిత గ్రిడ్, ఇంట్రా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. పైపులైన్లు లీకై నీరు వృథా అవుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. మరమ్మతుల పేరుతో గుంతలు తీసి అలాగే వదిలేయడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.



మంబాపూర్‌లో ప్రైవేటు బోరు మోటారు వద్ద మహిళల కష్టాలు

నిరుపయోగంగా మారిన మంచినీటి పథకం

**విద్యుత్ సమస్యల కారణంగానే అంతరాయం : ఏఈ**

నీటి సరఫరా నిలిచిపోవడంపై మిషన్ భగీరథ గ్రిడ్ ఏఈ రామకృష్ణను వివరణ కోరగా.. కమ్మదానం నుండి రాఘాపూర్‌కు రావాల్సిన నీటి పంపుల మరమ్మతులు, విద్యుత్ సమస్యల కారణంగానే సరఫరాలో అంతరాయం కలిగిందని తెలిపారు. ప్రస్తుతం మరమ్మత్తు పనులు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, శాశ్వత ప్రాతిపదికన తాగునీటి సమస్యను పరిష్కరించాలని మండల ప్రజలు వేడుకుంటున్నారు.

## డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నిరంతర అవగాహన

### అధికారులకు కలెక్టర్ ఆదేశం

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి , ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం బాలల భద్రత, రక్షణ డ్రగ్స్ రహిత సమాజం కోసం స్పెషల్ డ్రైవ్ ప్రారంభించనట్లు కలెక్టర్ దీపక్ తివారి తెలిపారు. ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్సు హాలునందు జిల్లా అధికారులతో ఆయన మాట్లాడుతూ, జిల్లాలో బాలల భద్రత, డ్రగ్స్ రహిత సమాజంపై అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రచారం పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. విద్యార్థులు, యువతతోపాటు వారి తల్లిదండ్రులకు కూడా మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాల గురించి వివరించాలన్నారు. ఈ దిశగా చైతన్యం తీసుకురావడం, డ్రగ్స్ అమ్మకాలను అరికట్టేందుకు ప్రభుత్వ చర్యలపై అవగాహన కల్పించడం, బాలల భద్రత, పోక్సో చట్టం, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, సోషల్ మీడియా వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాల్య వివాహాల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. బాలల రక్షణ కోసం ప్రభుత్వం అందుబాటులో ఉంచిన షీ టీమ్స్, ఇతర రక్షణ వ్యవస్థల ప్రాముఖ్యతను తెలియ జేయాలని అన్నారు. ఈ కార్యక్రమాలను జిల్లాలోని ప్రతి గ్రామం, విద్యాసంస్థల్లో సమర్థవంతంగా అమలు చేయాలని ఉన్నతాధికారులకు ఆదేశించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తమ పిల్లల ప్రవర్తనపై నిఘా ఉంచి, వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు , స్థానిక పోలీస్ యంత్రాంగం భాగస్వాములు కానున్నారని తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పి రాములు నాయక్, ట్రైని కలెక్టర్, సిపిఓ వెంకటేశ్వర్లు, డి ఆర్డిఎ శ్రీనివాస్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌సి విద్యార్థులు హాస్టళ్లను వినియోగించుకోవాలి

**ఘట్‌కేసర్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:** ప్రభుత్వం వసతిగృహాల్లో అందిస్తున్న సేవలను ఎస్‌సి విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్ జిల్లా ఎస్‌సి అభివృద్ధి అధికారి జి.వినోద్‌కుమార్ అన్నారు. ఘట్‌కేసర్ డివిజన్ అంబేద్కర్‌నగర్‌లో షెడ్యూల్ కులాల అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో హాస్టల్ బాట కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలోని సంక్షేమ వారోత్సవాలలో భాగంగా ఎస్‌సీ బస్తీలో అధికారులు, హాస్టల్ సిబ్బంది ఈకార్యక్రమం జరిపారు.

## యువత క్రీడల్లో రాణించాలి

**ఘట్‌కేసర్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:** ప్రభుత్వం ప్రతి మండలంలో ఇండోర్, ఔట్‌డోర్ స్టేడియంలు నిర్మించడం ద్వారా యువత క్రీడల వైపు వెళ్లి చెడువ్యసనాలకు దూరంగా ఉంటారని ఆటలతోనే ఆరోగ్యం, క్రమశిక్షణ, మంచి భవిష్యత్ సాధ్యమవుతుందని తెలంగాణ టెన్నిస్ వాలీబాల్ కార్యదర్శి గడ్డం శివశంకర వరప్రసాద్ అన్నారు. ఘట్‌కేసర్‌లో ప్రబుద్ధభారత్ ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని ప్రజలలోకి తీసుకువెళ్లడానికి 263వ వారం నిత్యపూలమాళ కార్యక్రమం నిర్వహించారు. సహకార సంఘం మాజీ చైర్మన్ సింగిరెడ్డి రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# హాతవిధీ.. ఇందనానికి దారేది?

★ ముహూర్తాల వేళ.. పెట్రోల్, డీజిల్ కటకట.. ★ పెళ్లి సందడికి ప్రతిబంధకం ★ కృత్రిమ కొరత సృష్టిస్తున్న బంకు యజమానులు ★ కి.మీ మేర వాహనాల క్యూ ★ పలు చోట్ల నో స్టాక్ బోర్డులు



కేశంపేట, షాద్‌నగర్‌లలో కిటకిటలాడుతున్న పెట్రోలు బంకులు





రద్దీ పెరగటంతో సమీక్షిస్తున్న అధికారులు

**షాద్‌నగర్/కేశంపేట, ఏప్రిల్ 27, ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలో గత రెండు రోజులుగా పెట్రోల్, డీజిల్ కొరత తీవ్రరూపం దాల్చింది. ఒకవైపు ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు ఇందన కొరత లేదని ప్రకటిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. పట్టణంలోని అనేక బంకుల వద్ద నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తుండటంతో వాహనదారులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ కావడంతో రాకపోకలు పెరిగాయి, కానీ పెట్రోల్ లభించక అనేక శుభకార్యాలకు ఆటంకం కలుగుతోంది. పెట్రోల్ కోసం వాహనదారులు కిలోమీటర్ల మేర క్యూ కడుతున్నారు. అన్నారం బైపాస్ దగ్గర ఉన్న ఒక బంకులో వాహనాలు బారులు తీరడంతో, పరిస్థితిని అదుపు చేయడానికి పోలీసులు పహారా కాస్తూ ఇంధన సరఫరాను పర్యవేక్షిస్తున్నారు. మరోవైపు, కొందరు బంకు యజమానులు కృత్రిమ కొరతను సృష్టించి బ్లాక్ మార్కెట్లో అధిక ధరలకు విక్రయిస్తున్నారని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఎండల తీవ్రతకు తోడు ఈ ఇంధన కష్టాలు తోడవడంతో సామాన్యులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు తక్షణమే స్పందించి ఇంధన సరఫరాను పునరుద్ధరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**కేశంపేట మండల కేంద్రంలో..**

మళ్లీ పెట్రోల్, డీజిల్ కొరత తీవ్రంగా కనిపిస్తోంది. కేశంపేట మండల కేంద్రంలోని భారత్ పెట్రోల్ పంప్ ఇండియన్ పెట్రోల్ పంప్ లలో పెట్రోల్ డీజిల్ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ వద్ద సోమవారం వాహనదారులు పెద్ద ఎత్తున బారులు తీరారు. పెట్రోల్ అందుబాటులో లేకపోవడంతో ఉదయం నుంచే వాహనదారులు క్యూలో నిలబడి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పెళ్లిళ్లకు, శుభకార్యాలకు వెళ్లే ప్రజలకు, పనుల కోసం బయలుదేరిన ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. సరఫరా లోపమే ఈ కొరతకు కారణమని స్థానికులు అంటున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పెట్రోల్ సరఫరాను పునరుద్ధరించాలని వాహనదారులు కోరుతున్నారు.

**జిల్లాలో పెట్రోల్, డీజిల్ కొరత లేదు:**

**అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి**

**రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:** జిల్లాలో పెట్రోల్, డీజిల్ నిల్వలు నిండుకున్నాయనే వార్తల్లో నిజం లేదని, ఇంధన కొరతపై ప్రజలు ఆందోళన చెందవద్దని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి స్పష్టం చేశారు. సోమవారం జిల్లాలోని కొన్ని పెట్రోల్ బంకుల్లో ఇంధనం కోసం రద్దీ పెరిగిన నేపథ్యంలో, ఆయన జిల్లా ఎనర్జీ మానిటరింగ్ కమిటీ సభ్యులు, ఆయిల్ కంపెనీల ప్రతినిధులు మరియు డీలర్లతో అత్యవసర టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. కృత్రిమ కొరత సృష్టించకుండా ఉండేందుకు డీలర్లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రధానంగా కొద్దిమంది వినియోగదారులకు అధిక మొత్తంలో ఇంధనాన్ని విక్రయించకూడదని సూచించారు. ప్రజలు తమ రోజువారీ అవసరాలకు మించి ఇందనాన్ని నిల్వ చేసుకోవడం ప్రమాదకరమని, అలాంటి చర్యలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు.

**అపోహాలు నమ్మవద్దు**

పెట్రోల్, డీజిల్ సరఫరా నిరంతరం కొనసాగుతుందని, ప్రజలు భయాందోళనతో ఒకేసారి బంకులకు రావద్దని కోరారు. నియంత్రిత అమ్మకాలు: సరఫరాను క్రమబద్ధీకరించేందుకు అవసరమైన మేరకే విక్రయాలు జరపాలని ఆయిల్ కంపెనీలను ఆదేశించారు.

**క్షేత్రస్థాయి పర్యవేక్షణ చేస్తున్నాం**

పౌరసరఫరాల శాఖ అధికారులు నిరంతరం బంకులను పర్యవేక్షి స్తున్నారని, పరిస్థితి త్వరలోనే సాధారణ స్థితికి వస్తుందని తెలిపారు. ఈ సమీక్షలో పౌరసరఫరాల శాఖ అధికారి వనజాతతో పాటు ఇతర శాఖల అధికారులు, ఆయిల్ కంపెనీల సేల్స్ ఆఫీసర్లు పాల్గొన్నారు. జిల్లా యంత్రాంగం తీసుకుంటున్న చర్యలకు ప్రజలు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.



ప్రజావాణికి వచ్చిన బాధితుల సమస్యలు ఆలకిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్

# తక్షణ పరిష్కారమే లక్ష్యం

### ప్రజావాణిలో అర్జీదారులకు కలెక్టర్ నారాయణ రెడ్డి హామీ

**జనగణనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపు**

**రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 27 ప్రభాతవార్త:** ప్రజా సమస్యల పరిష్కారంపై జిల్లా యంత్రాంగం మరింత అప్రమత్తంగా పనిచేయాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు.

ఈ వారం ప్రజావాణిలో మొత్తం 65 ఫిర్యాదులు నమోదయ్యాయి. ఇందులో రెవెన్యూ శాఖకు సంబంధించినవి 21 ఉండగా, ఇతర శాఖలకు చెందినవి 44 దరఖాస్తులు అందాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలు ప్రభుత్వంపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టేలా అధికారులు స్పందించాలని సూచించారు. ఏ ఒక్క అర్జీని పెండింగ్‌లో పెట్టకుండా తక్షణమే పరిశీలించి పరిష్కరించాలని, సమస్యల పరిష్కారంలో నిరక్ష్యం వహిస్తే సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు.

అనంతరం జనాభా గణన 2027 ప్రక్రియపై కలెక్టర్ అధికారులతో కలిసి అవగాహన కల్పించారు. జిల్లాలోని ప్రతి ఒక్కరూ స్వీయ గణనలో భాగస్వాములు కావాలని, ఇందుకోసం ప్రత్యేక వెబ్‌సైట్‌ను సందర్శించి సెల్ఫ్ డిక్లరేషన్ ఐడీ పొందాలని సూచించారు. ఏప్రిల్ 26 నుంచి మే 10 వరకు జరిగే ఈ గణనలో, సిబ్బంది ఇంటికి వచ్చినప్పుడు ఈ ఐడీ వివరాలను అందజేయాలని కోరారు. జిల్లా సెన్సస్ ఇన్చార్జి అధికారి శిరీష పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఈ ప్రక్రియను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు చంద్రారెడ్డి (రెవెన్యూ), కిరణ్మయి (లోకల్ బాడీస్), జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నిర్లక్ష్యం వహిస్తే సహించను

### మేడ్చల్ అర్బన్ హెల్త్ సెంటర్ సిబ్బందికి కలెక్టర్ వార్నింగ్

**మేడ్చల్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:** మేడ్చల్ పట్టణంలోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీ) జిల్లా కలెక్టర్ మను చౌదరి సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, సదుపాయాలు మరియు మందుల నిల్వలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. మొదట ఆసుపత్రిలోని ఔట్ పేషెంట్ విభాగం, చికిత్స గదులను తనిఖీ చేసిన కలెక్టర్, ప్రతిరోజూ ఎంతమంది రోగులు వస్తున్నారు, వారికి ఎలాంటి చికిత్స అందిస్తున్నారనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సమయానికి వైద్య సేవలు అందించాలని, రోగులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అనంతరం మెడిసిన్ స్టోరేజ్ విభాగాన్ని తనిఖీ చేసి, ట్యాబ్లెట్లు, సిరప్స్ యొక్క గడువు తేదీలను స్వయంగా పరిశీలించారు. గడువు ముగిసిన మందులను ఎట్టి పరిస్థితుల్లోనూ పంపిణీ చేయరాదని, నాణ్యమైన ఔషధాలనే రోగులకు అందించాలని అధికారులను ఆదేశించారు. మందుల నిల్వలను ఎప్పటికప్పుడు సమీక్షి స్తూ, అవసరమైన వాటిని ముందుగానే అందుబాటులో ఉంచాలని సూచించారు.



మేడ్చల్ అర్బన్ పిహెచ్‌సిని తనిఖీ చేస్తున్న కలెక్టర్ మనుచౌదరి

ఆసుపత్రి సిబ్బందితో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్న కలెక్టర్, అదనపు వాష్రూమ్ సౌకర్యం కల్పించాలని సిబ్బంది కోరగా, అందుకు సంబంధించిన ప్రతిపాదనలు తక్షణమే పంపాలని ఆదేశించారు. త్వరలోనే నిర్మాణ పనులు చేపడతామని ఆయన హామీ ఇచ్చారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, తాగునీరు, కూర్చునే సదుపాయాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ముఖ్యంగా మహిళలు, వృద్ధులకు ఇబ్బంది కలగకుండా చూడాలని చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో నమ్మకం పెరిగేలా సేవలు అందించాలని, విధుల్లో నిరక్ష్యం వహిస్తే సహించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ డిప్యూటీ తహసీల్దార్ అనూష, ఆర్ఐ కుమార్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# ఫ్యూచర్ సిటీ భద్రతకు కీలక అడుగు

- అత్యాధునిక పోలీసింగ్ లక్ష్యం
- డిజిపి శివధర్ రెడ్డి
- పోలీస్ కమిషనరేట్ భవనానికి ప్రారంభోత్సవం





నూతన కార్యాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న డిజిపి శివధర్ రెడ్డి

**రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త :** రాష్ట్రంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఫ్యూచర్ సిటీ ప్రాంత భద్రతా వ్యవస్థను మరింత పటిష్టం చేసే దిశగా ఒక కీలక ముందడుగు పడింది. తుకుగూడ ఫ్యాబ్ సిటీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ తాత్కాలిక భవనాన్ని రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన నూతన కార్యాలయ భవనాన్ని పరిశీలించి, అధికారులతో భద్రతా ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో సిపి జి. సుధీర్ బాబు మాట్లాడుతూ, ఫ్యూచర్ సిటీ అభివృద్ధి వేగానికి అనుగుణంగా ఆధునిక పోలీసింగ్ వ్యవస్థను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే ఈ కమిషనరేట్ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలకు సులభంగా చేరువయ్యేలా కేంద్ర ప్రాంతంలో, ఔటర్ రింగ్ రోడ్‌కు ఆనుకుని ఈ తాత్కాలిక కార్యాలయాన్ని సిద్ధం చేశామని తెలిపారు. రూ. 25 కోట్లతో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని మీర్ ఖాన్‌పేటలో 24 ఎకరాల విస్తీర్ణంలో శాశ్వత కమిషనరేట్ భవన నిర్మాణానికి ప్రభుత్వం ఇప్పటికే రూ. 25 కోట్లను మంజూరు చేసిందని సీపీ వెల్లడించారు. త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభించి, ఒకటి నుండి రెండు సంవత్సరాల వ్యవధిలో అత్యాధునిక సౌకర్యాలతో కూడిన పూర్తిస్థాయి భవనాన్ని అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్, సైబరాబాద్ కమిషనరేట్ల తరహాలోనే ఇక్కడి కార్యకలాపాలు సాగుతాయని స్పష్టం చేశారు. ఫ్యూచర్ సిటీ భద్రతకు ఈ కార్యాలయం ఒక కొత్త దిక్సూచిలా నిలుస్తుందని అధికారులు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సిపి చందనా దీప్తి, డిసిపిలు కె. నారాయణ రెడ్డి, శివమ్ ఉపాధ్యాయ, శిరీష, యోగేష్ గౌతమ్, అదనపు డిసిపి సత్యనారాయణతో పాటు వివిధ విభాగాల ఏసిపిలు, ఇన్‌స్పెక్టర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## సంబురాలు జరుపుకుంటున్న బిజెపి శ్రేణులు

**ఆమనగల్లు, ఏప్రిల్27, ప్రభాతవార్త:** ఆమనగల్లు మున్సిపాలిటీలో కోఆప్షన్ పదవుల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు కండెసీతారాములమ్మ, చుక్కా అల్లాజీగౌడ్, హలీమాబేగం విజయం సాధించడంతో ఆపార్టీ శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు. కూరగాయల మార్కెట్ చౌరస్తాలో బాణాసంచా కాల్చీ, మిఠాయిలు పంచిపెట్టి ఆనందం వ్యక్తం చేశారు. బీజేపీ నియోజకవర్గ అగ్రనాయకుడు, జాతీయ ఓబీసీ కమీషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి ముఖ్య అతిథులుగా హాజరైనారు. ఈసందర్బంగా ఆచారి మాట్లాడుతూ మున్సిపాలిటీ ఎన్నికల్లో బీజేపీ పార్టీని గెలుపుకు కారణమైన ప్రజలకు కృతజ్ఞతలు వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులతోపాటు కొత్తగా ఎన్నికైన కోఆప్షన్ సభ్యులు బాధ్యతతో కర్తవ్యాన్ని విస్మరించకుండా ప్రజాసమస్యలపై దృష్టి సారించి చిత్తశుద్ధితో వాటి పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతనంగా ఎన్నికైన సభ్యులకు శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ తల్లోజు గీత ఆచారి, బీజేపీ రాష్ట్ర నాయకులు కండె హరిప్రసాద్, బీజేపీ ఫ్లోర్ లీడర్ మొక్తాల వెంకటయ్య, కౌన్సిలర్లు ఎర్రవోలు మహేశ్, సునీత, నిరంజన్, దోళి, మాజీ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, గోరటి నర్సింహ్మా, మేడిశెట్టి శ్రీధర్, కండె భాస్కర్, చెక్కాల లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

## ఎన్యుమరేటర్లకు దిశ నిర్దేశం చేసిన తహసిల్దార్



**కేశంపేట, ఏప్రిల్ 27, ప్రభాతవార్త :**
జనగణన కార్యక్రమంలో భాగంగా ఏన్యూమారేటర్లకు ( సెన్సస్ ) కార్యక్రమాన్ని సోమవారం కేశంపేట మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో దిశా నిర్దేశం చేసినట్లు తహసిల్దార్ రాజేందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా తహసిల్దార్ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ మొదటి విడతలో ఎన్నుకోబడిన 46 మంది ఎన్యూమారేటర్లకు సోమవారం నుండి మూడు రోజులపాటు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో గ్రామాలలోని కుటుంబ సభ్యుల గృహ వివరాల సేకరణ, గణాంకాల నమోదు, డిజిటల్ విధానాల వినియోగం, వంటి తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. ఏన్యూ మారేటర్లు మండల పరిధిలో జనగణన ప్రక్రియలు సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ మూడు రోజుల శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని తద్వారా జనగణ ప్రక్రియ వేగవంతంగా పూర్తవుతుందని తహసిల్దార్ రాజేందర్ రెడ్డి తెలిపారు.

## మెగా జాబ్ మేళాను సద్వినియోగించుకోండి

**కేశంపేట ,ఏప్రిల్ 27 ,ప్రభాతవార్త :**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మే 11న మెగా జాబ్ మేళాని రంగారెడ్డి జిల్లాలో నిర్వహించడం జరుగుతుందని ఇందులో పాల్గొనేందుకు ప్రముఖ పరిశ్రమలు, ఐటీ సంస్థలు, ఇతరాత్ర సేవా రంగ సంస్థలు పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేసుకుంటారని ఈ అవకాశాన్ని అర్హులైన నిరుద్యోగ యువతి, యువకులు వెబ్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని ఎంపీడీవో రవిచంద్ర కుమార్ రెడ్డి సూచించారు.

## ప్రజలు కెసిఆర్‌ను ఎప్పటికీ మర్చిపోరు

**షాద్‌నగర్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త :** ఎవరెన్ని కుట్రలు చేసినా కేసీఆర్‌ను మాత్రం ప్రజల గుండెల్లో నుంచి తొలగించలేరని మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ అన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా షాద్‌నగర్ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గులాబీ జెండాను ఎగరవేసిన అనంతరం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ సహకార కార్పోరేషన్ చైర్మన్ రాజవరప్రసాద్, మాజీ ఎస్సీ ఎస్టీ కమీషన్ మెంబర్ రాంబాల్ నాయక్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి, పట్టణ కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, వార్డు అధ్యక్షులు, బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

**మోమిన్‌పేట్‌లో..**

**మోమిన్‌పేట్, ఏప్రిల్ 27. ప్రభాతవార్త:** భారత రాష్ట్ర సమితి పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పలు గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. మండలపరిధిలోని కేసారం, దేవరంపల్లి పలు గ్రామాలలో 26వ, పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ అధినేత కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు పార్టీ నాయకులు, యువకులు, కార్యకర్తలు పాల్గొని జెండా ఎగురవేసి, మిఠాయిలు పంచుకొని జై కేసీఆర్, జై కేటీఆర్ అంటూ నినాదాలతో ఈ ఆవిర్భావ ఏడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, ప్రజా ప్రతినిధులు, అభిమానులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్‌పైదాడి చేసిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలి

తలకొండపల్లి ఏప్రిల్26,ప్రభాత వార్త;రంగారెడ్డి జిల్లాలోనిచౌదరిగూడ మండలం ఎలుకగూడెం గ్రామ సర్పంచ్ బందెయ్యపై విచక్షణారహితంగా మారణాయుధాలతో దాడి చేసి గాయపరిచిన అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రామ్ రెడ్డి తదితర నిందితులపై పోలీసులు కఠినమైన చర్యలు తీసుకోవాలనీ తలకొండపల్లి సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు కటికల శేఖర్ యాదవ్ అన్నారు. ఆదివారం నాడు విలేకరులతో మాట్లాడుతూ కులం తక్కువ వాడని వివక్ష చూపుతూ గ్రామంలో ఈదమ్మ జాతర జరపకుండా మార్గమధ్యలోనే కుట్ర పూరితంగా అడ్డుకొని మారణాయుధాలతో మాజీ సర్పంచ్ రామ్ రెడ్డి అతని అనుచరులు తెగబడి దాడి చేయడం అవివేకమని అన్నారు. కుల వివక్ష కోసం పాకులాడుతున్న మాజీ సర్పంచ్ రామ్ రెడ్డి పై చట్టపరంగా చర్యలు తీసుకొని, వారిని తక్షణమే జైలుకు పంపాలని తలకొండపల్లి మండల సర్పంచ్ల సంఘం అధ్యక్షులు తలకొండపల్లి సర్పంచ్ కటికల శేఖర్ యాదవ్ గారు డిమాండ్ చేశారు.

## ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్

**షాద్ నగర్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త :** షాద్ నగర్ మున్సిపల్7వార్డు లో సూర్య కాలనీ లో పిట్టల మనిషా సురేష్ ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ మహోత్సవంలో షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు.

## ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి

..మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ వద్ద బిఆర్‌ఎస్ విద్యార్థులు ఆందోళన




**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:**
రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఫీజురియంబర్స్ మెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ వద్ద బిఆర్‌ఎస్ విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ వద్ద రాష్ట్ర బిఆర్‌ఎస్ విద్యార్థి సంఘం పిలుపు మేరకు మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ వద్ద జిల్లా బిఆర్‌ఎస్ విద్యార్థి సంఘం నాయకులు ఆందోళన వ్యక్తం చేసి ప్రభుత్వం వెంటనే స్పందించి ఫీజు రియంబర్స్ మెంట్ బకాయిలు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. మేడ్చల్ జిల్లా బిఆర్‌ఎస్‌వి కోఆర్డినేటర్‌లు రామచర్ల నర్సింగ్, చాప భాస్కర్‌యాదవ్‌ల ఆధ్వర్యంలో ఫీజురియంబర్స్ మెంట్ పోరుబాట కార్యక్రమాన్ని వారు నిర్వహించారు. ఫీజురియంబర్స్ మెంట్ బకాయిలు అందక విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. దీనికి ముందుకు కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో బిఆర్‌ఎస్ విద్యార్థి నాయకులు జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డిని కలిసి ప్రభుత్వం ఫీజురియంబర్స్ మెంట్ బకాయిలు చెల్లించాలని వినతిపత్రాన్ని విద్యార్థి నాయకులు అందజేశారు. బిఆర్‌ఎస్ వి ఫీజు పోరుబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని, ఈ నెల 29న డిగ్రీ, వృత్తి విద్యా కళాశాలల బంద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. విద్యార్థులు అందరు పాల్గొని బంద్‌ను విజయవంతం చేయాలని వారు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్‌వి నాయకులు యశ్వంత్, పవన్‌ముదిరాజ్, సూర్యతేజగౌడ్, రవికిరణ్, ప్రవీణ్‌నాయక్, రాజేశ్, మునిషా, సాయిముదిరాజ్, సొహైల్‌ఖాన్, పలువురు విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

# మహిళ ఒంటిపై బంగారు ఆభరణాలు చోరి

-నిందితుడు అరెస్టు... రిమాండ్‌కు తరలింపు

**ఆమనగల్లు, ఏప్రిల్27, ప్రభాతవార్త:** అమాయకపు మహిళను మాయమాటలతో మభ్యపెట్టి రుణం ఇప్పిస్తానని నమ్మబలికి చివరికి ఆమె మెడపై ఉన్న బంగారు ఆభరణాలు తస్కరించిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించిన సంఘటన ఒకటి ఆమనగల్లు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కేసుకు సంబంధించిన వివరాలను ఎస్‌హెచ్‌ఓ వెంకటేశ్వర్లు స్థానిక విలేకరులకు వివరించారు. నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం ఉల్పరా గ్రామానికి చెందిన ముకురాల రాజేందర్‌గౌడ్ అలియాస్ రామకృష్ణ అనే వ్యక్తి చికెన్ షాప్ నిర్వర్తిస్తూ జీవనం సాగిస్తున్నాడు. వెల్దండ మండలం కుప్పగండ్ల గ్రామానికి చెందిన మహిళను ఏప్రిల్ 21న పరిచయం చేసుకుని రుణం ఇప్పిస్తానని నమ్మించి తన వెంట తీసుకుని ఆమనగల్లు మండలం చింతలపల్లి గ్రామం శివారు ప్రాంతంలో నిర్మానుష్య ప్రాంతానికి వచ్చాడు. ఆమె ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలపై కన్నేసి ఉంచిన అతను అక్కడ మహిళను బెదిరించి రూ. 31వేల విలువగల నగలును బలవంతంగా లాక్కుని పారిపోయినట్లు వివరించారు. బాధిత మహిళ ఆమనగల్లు పోలీస్‌స్టేషనలో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈమేరకు ఆమనగల్లు బస్టాండ్



నిందితుడిని ప్రదర్శిస్తున్న పోలీసులు

ఆవరణలో అనుమానస్పందంగా తిరుగుతుండగా దర్యాప్తు బృందం అదుపులోకి తీసుకుని విచారించామని, విచారణలో నిందితుడు ఆభరణాలు ఎత్తికెళ్ళినట్లు రుజువయిందని చెప్పారు. ఘటనలో వినియోగించిన బైక్, సెల్‌పోన్‌ను సీజ్ చేసి న్యాయమూర్తి ఆదేశానుసారం చంచల్‌గూడ జైలుకు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌ఓ వెంకటేశ్వర్లు తెలిపారు. కాగా నిందితుడు రామకృష్ణపై వివిధ పోలీస్‌స్టేషనలలో 10కిపైగా కేసులు నమోదై ఉన్నట్లు ఆయన వివరించారు.

# కోఆప్షన్ సభ్యుల ఎన్నిక ప్రశాంతం

### బిజెపి3-కాంగ్రెస్-1 వరించిన పదవులు

**ఆమనగల్లు, ఏప్రిల్27, ప్రభాతవార్త:** ఆమనగల్లు మున్సిపాలిటీ కోఆప్షన్‌సభ్యుల ఎన్నిక ప్రశాంతంగా లాంఛనంగా జరిగింది. చైర్మన్ నేనావత్ పత్యానాయక్ అధ్యక్షతన కమీషనర్ శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో సోమవారం మున్సిపాలిటీ సమావేశం హాలులో నిర్వహించారు. బీజేపీ-కాంగ్రేస్ కూటమికి చెందిన 8 మంది, బీఆర్‌ఎస్ పార్టీ 7 మంది కౌన్సిల్ సభ్యులు ఎన్నిక సమావేశానికి హాజరైనారు.

ఈసందర్బంగా కోఆప్షన్ పదవులకు దరఖాస్తులు చేసు కున్న అభ్యర్థుల పేర్లను కమీ షనర్ చదవగా కౌన్సిల్ సభ్యులు చేయి ఎత్తి తమ మద్దతు ద్వారా ఎన్నుకున్నారు. ఈక్రమంలో కూటమికి చెందిన కాంగ్రేస్ మద్దతుదారుడు అబ్దుల్ ఖాదర్, బీజేపీ పార్టీ నుండి కండె సీతారాములమ్మ, చుక్కా అల్లా జీగౌడ్ హలీమాబేగంలు కౌన్సిల్ సభ్యుల మద్దతులో ఎన్నికయ్యారు.



నియామకపు పత్రం అందుకుంటున్న చుక్కా అల్లాజీగౌడ్

దీంతో నాలుగు పదవులు బీజేపీ-కాంగ్రేస్ పార్టీల కూటమికే దక్కాయి. ఈమేరకు చైర్మన్ పత్యానాయక్, వైస్ చైర్మన్ తల్లోజు గీత ఆచారి సమక్షంలో అభ్యర్థులకు నియామకపత్రాలు అందజేశారు.

# కోదండరాంకు ఎమ్మెల్సీ పదవితో ఉద్యమ కారులకు గౌరవం

**షాద్‌నగర్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర సాధనలో పొలిటికల్ జాక్ చైర్మన్ గా కీలక భూమిక పోషించిన,తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమాల రథ సారధిగా పని చేసిన ప్రొఫెసర్ యం.కోదండరాం సార్ ఎమ్మెల్సీగా నియామకం అయిన సందర్బంగా తెలంగాణ ఉద్యమ కారుల వెల్ఫేర్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పి వెంకట్ రాంరెడ్డి, ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్సీగా ప్రో.కోదండరాం నియామకానికి ప్రతిపాదనలు పంపిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి, మంత్రులకు, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు ఆమోదం తెలిపిన రాష్ట్ర గవర్నర్ కు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నో పోరాటాల తర్వాత ఉద్యమకారులకు ప్రొఫెసర్ కోదండరాంకి కాంగ్రెస్ ప్రభుత్వంలో గుర్తింపు లభించడం సంతోషకరం అని అన్నారు. తెలంగాణ ఉద్యమకారులకు తగిన ప్రాధాన్యమిస్తున్న కాంగ్రెస్ పార్టీకి ఈ సందర్భంగా దన్యవాదాలు తెలిపారు.

### బిఆర్‌ఎస్ యువనేతకు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆర్థిక సాయం

**ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 27, ప్రభాత వార్త:** రోడ్డు ప్రమాదంలో గాయపడిన పోచారం డివిజన్ బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు కొమ్ముల ప్రశాంత్‌కు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అందజేసిన 50 వేల రూపాయలను సోమవారం మున్సిపల్ మాజీ చైర్మన్ బి. కొండల్‌రెడ్డి బాధితుడికి అందజేసినట్లు తెలిపారు.



బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు ప్రశాంత్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి అన్నోజిగూడ రాజీవ్ గృహకల్ప కాలనీలో ఇంటికే పరిమితం అయ్యాడు. ఈ విషయం మాజీ మున్సిపల్ చైర్మన్ కొండల్ రెడ్డి ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి 50 వేల ఆర్థిక సహాయాన్ని తన వంతు సహాయంగా అందించాల్సిందిగా మాజీ చైర్మన్‌గా కోరాడు. దీంతో నగదు రూపాయలను మాజీ మున్సిపల్ చైర్మన్ కొండల్ రెడ్డి బాధితుడి ఇంటికి వెళ్లి నగదును అందజేసినట్లు తెలిపారు. మాజీ మున్సిపల్ చైర్మన్ వెంబడి బీఆర్‌ఎస్ రాష్ట్ర గిరిజన నాయకుడు జితేందర్ నాయక్, కేఎం. రెడ్డి, పాశం లక్ష్మణ్ యాదవ్, సంతోశ్ నాయక్, రాఘవేందర్ రెడ్డి, తిలక్ నాయక్, గాంధారి నవీన్, బాస్కర్‌రెడ్డి తదితరులున్నారు.

### సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు పంపిణీ

**శామీర్‌పేట, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:**
దేవరయాంజాల్‌కు చెందిన తుర్కపల్లి నాగరాజుకు సిఎం రిలీఫ్ ఫండ్ ఆర్థిక సహాయం మంజూరు కావటంతో రూ.60వేల చెక్కును బాధిత కుటుంబానికి మేడ్చల్ జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి అందజేశారు.సోమవారం శామీర్‌పేట మండలంలోని దేవరయాంజాల్‌కు చెందిన తుర్కపల్లి నాగరాజుకు సిఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఆర్థిక సహాయం మంజూరు కావటంతో ఆ చెక్కును జైపాల్‌రెడ్డి అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఆరోగ్య సేవలు అందించేందుకు సిఎం రిలీఫ్ ఫండ్ దోహదపడు తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచు టి.శంకం గౌడ్, రామాలయం మాజీ చైర్మన్ పి.లక్ష్మినారాయణ, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పి.ధర్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### సర్పంచుల సమస్యలపై పోరాటం చేయాలి

**ఆమనగల్లు, ఏప్రిల్27, ప్రభాతవార్త:** ప్రజాసేవలో సర్పంచులు ప్రధానంగా ఎదుర్కుంటున్న సమస్యలను గళమెత్తి వాటి పరిష్కారానికి కృషి చేయాలని కడ్తాల మండలం మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్ ఆమనగల్లు మండల సర్పంచుల సంఘం నూతన



అధ్యక్షుడు వద్యావత్ శ్రీనునాయక్‌ను కోరారు. గ్రామాలాభివృద్ధి సర్పంచులతోనే సాధ్యమని, వారికి ప్రభుత్వం నిరంతరం తోడ్పాటునందించాలని అన్నారు. ఆమనగల్లు మండల సర్పంచుల సంఘం నూతన అధ్యక్షుడిగా శ్రీనునాయక్ ఎన్నికైన సందర్భంగా సోమవారం దశరథ్‌నాయక్ ప్రత్యేకంగా కలుసుకుని సన్మానించి అభినందించారు. ఈసందర్భంగా ఆయన పలు సలహాలు, సూచనలు అందజేశారు. కర్తవ్యాన్ని సమర్థవంతంగా నిర్వర్తించి అందరి మన్ననలను పొందాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు రేఖనాయక్, సాలార్‌పూర్ సర్పంచు ప్రియారమేశ్‌నాయక్, పాండునాయక్ తదితరులు ఉన్నారు.

### శామీర్‌పేట పెద్ద చెరువుకట్ట మైసమ్మ ఆలయ వార్షికోత్సవం

**శామీర్‌పేట, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:**
శామీర్‌పేట పెద్ద చెరువు కట్ట మైసమ్మ ఆలయ వార్షికోత్సవ కార్యక్రమానికి మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డిని శామీర్‌పేట పెద్ద చెరువు కమిటీ పాలకవర్గంతో పాటు మాజీ ఎంపిపి డి.ఎల్లుబాయిబాబు, గ్రామస్థులు కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు. సోమవారం ఆయన నివాసంకు మాజీ ఎంపిపి డి.ఎల్లుబాయిబాబు, సొసైటీ మాజీ వైస్‌చైర్మన్ ఎం.ఐలయ్యయాదవ్,మాజీ ఉపసర్పంచు ఎన్.రమేశ్, శామీర్‌పేట కట్టమైసమ్మ ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ వి.భూమిరెడ్డి, డి.బాల్‌రాజ్‌గౌడ్, ఆ కమిటీ పాలకవర్గం వారు, బిఆర్‌ఎస్ నాయకులు వంగ వెంకట్‌రెడ్డి, దాసరిబాబు, పలువురు వెళ్లి ఆహ్వానపత్రికను ఎమ్మెల్యే మల్లారెడ్డికి అందజేశారు. మే 3,4తేదీలలో జరిగే వార్షికోత్సవ కార్యక్రమానికి ఆయనను ఆహ్వానించినట్లు తెలిపారు.

### వెంకటేష్‌కు బాల్యమిత్రులు గ్రామస్తుల సాయం

**యాచారం,ఏప్రిల్ 27, ప్రభాతవార్త:**
పని నిమిత్తం కుటుంబ సమేతంగా హైదరాబాద్‌కు వెళ్తున్న కుర్మమోని వెంకటేష్ ముది రాజ్ కారు ప్రమాదంలో తీవ్ర గాయాల పాలై హైదరాబాదులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న చిన్ననాటి మిత్రులు నెర్రె శ్రీశైలం ఆధ్వర్యంలో సామాజిక మాధ్యమాల ద్వారా సమాచారం తెలియ జేశారు.సుమారు 150 మంది చిన్ననాటి మిత్రులు బంధుమిత్రులు గ్రామస్తులు స్పందించి సుమారు రూ 215000 బాధిత కుటుంబానికి అందజేశారు. గ్రామంలో గతంలో కూడా ఎవ్వరికీ ప్రమాదాల బారిన పాడిన ఇబ్బందులు వచ్చిన గ్రామంలో వారందరూ సమన్వయంతో సమిష్టిగా తమ వంతుగా సహాయ సహకారాలు ఎల్లవేళలా అందజేస్తున్నారని గుర్తు చేశారు.



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న చిన్న నాటి మిత్రులు

### యాచారంలో ఘనంగా బిఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం

**యాచారం,ఏప్రిల్ 27, ప్రభాతవార్త:**
భారత రాష్ట్ర సమితి పార్టీ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని సోమవారం యాచారం మండ లం కేంద్రంలోని సాగర్ రహదారి పై జెండా ఆవిష్కరించి జయ శంకర్ చిత్రపటానికి పూల మాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్బంగా బి ఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కర్నాటి రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణలో అభివృద్ధి జరిగిందంటే కేసీఆర్ కేటీఆర్లతోనే నని నేడు అందుకు భిన్నంగా ఉందని అన్నారు. ఎన్నో త్యాగాలు చేస్తేనే తెలంగాణ రాష్ట్ర ఏర్పడిందని ప్రజలు అన్ని గమనిస్తున్నారని గుర్తు చేశారు. అభివృద్ధి జరగాలంటే మళ్ళీ తెలంగాణ రాష్ట్రంలో బిఆర్‌ఎస్ అధికారంలోకి రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కిషన్ నాయక్, శ్రీనివాస్ చారి, కాజు మహమ్మద్, రమావత్ జగదీష్ నాయక్, యాదయ్య గౌడ్, కిషన్ నాయక్, వెంకటేష్ యాదవ్, నీట్టి బీరప్ప నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



యాచారం మండల కేంద్రంలో బిఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం

## దేవాలయాన్ని అభివృద్ధి చేసుకుందాం

..ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

**యాలాల, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:** శ్రీరామాపురం (రసూల్‌పూర్) దేవాలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకుందామని ఎమ్మెల్యే బుయ్యని మనో హర్‌రెడ్డి అన్నారు. సోమవారం నిర్వహించిన శ్రీరామాపురం హనుమాన్‌మందిర్ నూతన చైర్మెన్ రాధక్రిష్ణబూబ్, పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజై నూతన కార్యవర్గానికి శుభా కాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేవాలయాల అభివృద్ధి కోసం పాలకవర్గం కృషిచేయాలని, ఎల్లప్పుడు తనవంతు సహకారం ఉంటుందని అన్నారు.



రాధక్రిష్ణబూబ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

### ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి సర్పంచ్ చేయూత

హర్షం వ్యక్తం చేసిన గ్రామస్తులు

**కేశంపేట, ఏప్రిల్ 27, ప్రభాతవార్త :**
నిరుపేదల సొంతింటి కల సాకారం చేసుకోవడంలో నిరుపేదలకు ఎన్నో ఇబ్బందులు లబ్ధిదారులకు అండగా నిలిచిన సర్పంచ్ బీసా కవితా కరుణాకర్ రెడ్డి. కేశంపేట మండలం తొమ్మిది రేకుల గ్రామంలో పోలమెని ఉమాదేవి రాజారాం దంపతులుకు కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయినది ఇల్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులు ఇల్లుకు స్లాబ్ వేసుకునే స్తోమత లేకపోవడంతో ఈ విషయాన్ని తెలుసుకున్న గ్రామ సర్పంచ్ బీస కవితా కరుణాకర్ రెడ్డి ఉమాదేవి రాజారాం నిరుపేదల అయినందున స్లాబ్ నిర్మాణానికి పదివేల రూపాయలతో 40 సంచుల సిమెంట్ ను లబ్ధిదారుడికి ఇప్పించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారు ఉమాదేవి వారి కుటుంబ సభ్యులు మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలోనే మా సొంత ఇంటి కల సహకారం అయిందని మా సొంతింటి కలను సాకారం చేసేందుకు కృషి చేసిన బీసా కవితా కరుణాకర్ రెడ్డి లకు ప్రత్యేక ధన్యవాదాలు. ఈ సందర్భంగా సర్పంచ్ కవితా కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో నిరుపేదలైన ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకొనే ప్రతి ఒక్కరికి సహాయ సహకార అందిస్తానని కొత్త వారికి ఇండ్లు మంజూరు చేయించి నిర్మిస్తానని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఉడ్ తవత్ రవి నాయక్, లాలమేని పాండు, గ్రామ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి 89దరఖాస్తులు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:**
మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి కార్యక్రమం జరిగింది. జిల్లా వ్యాప్తంగా ఈ ప్రజావాణిలో 89ధరఖాస్తులు అందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన ధరఖాస్తులను వెంటనే పరిశీలించి పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అధికారులు బాధ్యతగా వ్యవరించి ప్రజావాణిలో వచ్చిన ధరఖాస్తుల పరిష్కారానికి దృష్టి సారించాలని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా డిఆర్‌ఓ చంద్రావతి,పలువురు వివిధ శాఖలకు చెందిన సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అభివృద్ధి బాటలో మహేశ్వరం

-గ్రామాభివృద్ధికి రూ.12 లక్షలతో సిసి రోడ్డు, త్రాగునీటి సదుపాయం

-ప్రతి వార్డులో సిసి రోడ్లు, డ్రైనేజీ పనులు పూర్తి చేస్తాం సర్పంచ్ మునగపాటి నవీన్

-వేసవిలో తాగునీటి సమస్య లేకుండా ప్రత్యేక చర్యలు

**మహేశ్వరం,ఏప్రిల్ 27,ప్రభాతవార్త:** మహేశ్వరం గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు గ్రామ పంచాయతీ యంత్రాంగం వేగంగా అడుగులు వేస్తోంది. గ్రామ పంచాయతీ పరిధిలోని మార్కెట్ సముదాయంలో రూ.10 లక్షల గ్రామ పంచాయతీ నిధులతో నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టగా, ఆనెగొని రమేశ్ ఇంటి సమీపంలో రూ.2 లక్షల వ్యయంతో బోర్‌వెల్ డ్రిల్లింగ్ చేసి మోటార్ పంప్‌సెట్ ఏర్పాటు చేశారు. ఈ అభివృద్ధి పనులను గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్ వార్డు సభ్యులు, గ్రామ పెద్దల సమక్షంలో ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మునగపాటి నవీన్ మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి వార్డులో విడతల వారీగా సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులను పూర్తి చేస్తున్నామని తెలిపారు. వేసవి కాలంలో గ్రామ ప్రజలకు ఎక్కడా తాగునీటి కొరత రాకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ప్రతి వార్డులో బోర్ మోటార్ల డ్రిల్లింగ్‌తో పాటు కొత్త మోటార్ పంప్‌సెట్లను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు.గ్రామ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని మౌలిక వసతులను కల్పించడమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. స్థానిక ఎమ్మెల్యే,మాజీ విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సహకారంతో మరిన్ని నిధులను తీసుకువచ్చి మహేశ్వరాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జొరల రమేశ్, వార్డు సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి సుజాతతో పాటు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు. మహేశ్వరం గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



బోరు మోటర్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్ నవీన్

**PUBLIC NOTICE FOR LOSS OF ORIGINAL DOCUMENTS**

This is to inform the general public that my client MR KADIRE SHEKAR REDDY, S/o Kadire Ganapathy Reddy had lost his Original Link Documents 1). Regd. Sale Deed Document No. 192/2001, Dated 21.12.2000, 2). Regd. Agreement of Sale-Cum-GPA Deed Document No. 2697/2001, Dated 18.06.2001, 3). Regd. Sale Deed Document No. 8265/2006, Dated 24.06.2006, and 4). Regd.Sale Deed Document No. 14901/2006, Dated 30.11.2006 pertaining to Agriculture Land admeasuring Ac.1.00 Gts in Sy.No.12, Pedda Shapur Village, Shamshabad Mandal, Ranga Reddy District when he was traveling from his house to Thukkuguda on his bike.

If any person or persons finds the said Original Link Documents 1). Regd. Sale Deed Document No. 192/2001, Dated 21.12.2000, 2). Regd. Agreement of Sale-Cum-GPA Deed Document No. 2697/2001, Dated 18.06.2001, 3). Regd. Sale Deed Document No. 8265/2006, Dated 24.06.2006, and 4). Regd.Sale Deed Document No. 14901/2006, Dated 30.11.2006 the same may be handed over to the undersigned as a law-abiding citizen. Further, the above said original documents shall not be abused or misused or otherwise utilized by unauthorized person. If any unauthorized person makes misuse of Them, the same shall not bind on my client.

Hence this Public Notice.

Sd/- P. ASHOK
Advocate
Office at: 10-94, Opp: M R O Office, Maheshwaram, Ranga Reddy District. Cell. 9848721918


జాతీయ ఎస్సీ కమీషనర్ కు ఫిర్యాదు చేస్తున్న ఎట్లఎర్రవల్లి గ్రామస్తులు

## నిందితులను అరెస్టు చేయాలని జాతీయ ఎస్సీ కమిషన్ ఆశ్రయించిన గ్రామస్తులు

**షాబాద్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త :** ఎట్లఎర్రవల్లి గ్రామంలో దళితులపై సామూహిక దాడిచేసిన వారిని అరెస్టు చేయాలని గ్రామస్తులు జాతీయ ఎస్సీ కమిషన్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి శంకర్ మాట్లాడుతూ... దళితుల స్థలాన్ని ఆక్రమించేందుకు ఆధిపత్య దర్గాలు ప్రయత్నించడంతో వ్యతిరేకించిన దళితులపై అగ్రవర్ణాలు దాడి చేసి హత్యప్రయత్నం చేశారని ఆరోపించారు. దళిత సర్పంచును తన ఏజెంట్గా మార్చుకొని దళితులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతూ గ్రామంలో శాంతిభద్రత సమస్యలను సృష్టిస్తున్నారన్నారు. దళితులపై దాడిచేసిన సురేందర్‌రెడ్డి మరో 16 మందిపై ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదు అయినందున నిందుతులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. వారిపై చర్యలు తీసుకోవడంలో పోలీసులు నిరక్ష ్యన్ని వివక్షను పాటిస్తే భవిష్యత్లో ఆందోళనలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో దళిత భోజన ఫ్రెంట్ రాష్ట్ర కార్యదర్శి కల్పన, న్యాయవాది ప్రభాకర్, డిబిఎఫ్ నాయకురాలు శారద, బాదితులు నరసింహ, నరేందర్, బాబు, జగన్ తదితరులు ఉన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే

**నందిగామ, ఏప్రిల్ 25, ప్రభాతవార్త :** నందిగామ మండలం వెంకమ్మగూడ గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత గుండాల సాములయ్య కుమారుడు కృష్ణ వివాహం మద్దూరు ఎస్ బి గార్డెన్లో కన్వెన్షన్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి షాద్నగర్ ఎమ్మెల్యే, టీపిసిసి ఓబీసీ విభాగం అధ్యక్షుడు, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ ముఖ్య అతిథిగా హాజరై నూతన వధూవరులు కృష్ణ మనస్వి నవ దంపతులను ఆశీర్వదించారు. ఈ వేడుకల్లో మాజీ ఎంపీపీ ఎం శివశంకర్ గౌడ్, సర్పంచులు గొర్లపల్లి అశోక్, మంకాల శ్రీశైలం, కొమ్ము కృష్ణ, చినంతర గారిమల్లేష్, కాంగ్రెస్ నాయకులు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జంగ నరసింహులు, మాజీ ఎంపీటీసీ దేపల్లె కుమార్ గౌడ్, పసుల బుచ్చయ్య, కావలి కృష్ణ, బుయ్యని వీరేందర్ గౌడ్, వడ్డే శీను, మీసేవ నర్సింహులు, నీరటి రవి, సీతారాం, సి కృష్ణ గౌడ్, బి కృష్ణయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## నల్గొండ గద్దర్ గళం..ప్రకృతికి బలం!

-పర్యావరణ పాటలు పాడాలని వార్ల మల్లేశం విజ్ఞప్తి

**దౌల్తాబాద్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:**

పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు తన గొంతుకతో పాటలు పాడాలని ప్రముఖ జానపద గాయకుడు నల్గొండ గద్దర్‌ను పర్యావరణ పరిశోధకుడు వార్ల మల్లేశం కోరారు. ఈ సంధర్భంగా సోమవారంరోజు హైదరాబాద్‌లో ఆయనను కలిసి, జీవవైవిధ్య సంరక్షణ, భూమాత ప్రాముఖ్యతపై అవగాహన గీతాలు రూపొందించాలని విన్నవించారు. దీనిపై నల్గొండ గద్దర్ సానుకూలంగా స్పందిస్తూ, మల్లేశం చేస్తున్న కృషిని అభినందిచినట్లు వారు తెలిపారు.


నల్గొండ గద్దర్‌తో మాట్లాడుతున్న వార్ల మల్లేశం

### ప్రతాప్ లింగం మృతి బాధాకరం..

**షాద్‌నగర్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** స్థానిక విజ్ఞాన్ కళాశాల ప్రిన్సిపాల్ విశ్వనాథ్, టీవీ9 రిపోర్టర్ శివ కుమార్ ల తండ్రి ప్రతాప లింగం మృతి చెందడం బాధాకరమని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాపరెడ్డి అన్నారు. అనారోగ్యం కారణంగా ఆయన మరణించిన నేపథ్యంలో స్థానిక వెంకటేశ్వర కాలనీ లోపల ఆయన ఇంటికి వెళ్లి వారి కుటుంబాన్ని పరామర్శించారు. మంచి వ్యక్తిగా, వివాదరహితుడిగా పేరుపొందిన ప్రతాప లింగం మరణం అత్యంత బాధాకరమని అన్నారు. వారి కుటుంబానికి ఆ దేవుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

# అధిక రసాయనాల వల్ల పర్యావరణానికే ముప్పు

**చౌడాపూర్, ఏప్రిల్ 27 , ప్రభాతవార్త:**



అధిక రసాయన మందుల వినియోగం వలన పర్యావరణానికే ముప్పు ఉంధని, నేలతల్లిని ఆరోగ్యంగా ఉంచితేనే పంటల దిగుబడి అధికంగా ఉంటుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు తెలిపారు. సోమవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ పరిశోధన స్థానం, తాండూరు వారి ఆధ్వర్యంలో "రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు" అనే కార్యక్రమాన్ని మండల కేంద్రం లోని రైతు వేదికలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డా. కె. పరిమళ మాట్లాడుతూ రైతులు యూరియా వాడకాన్ని తగ్గించాలని, యూరియా అధిక వినియోగం వల్ల నేల ఆరోగ్యం దెబ్బతిని, దీర్ఘకాలిక ఉత్పాదకత తగ్గుతుందని పేర్కొన్నారు.

రైతులు రసాయనాల వినియోగాన్ని తగ్గించి, ప్రకృతిని కాపాడాలని సూచించారు. పురుగు మందులతో రైతులకు మేలు చేసే వానపాములు, మిత్ర పురుగులు కూడా నశిస్తున్నాయని తెలిపారు. మార్కెట్లో గిరాకి ఉన్న వరి రకాలు అయిన ఆర్.ఎన్.ఆర్ 15048, కే.ఎన్.ఎం 1638, జే.జి.ఎల్ 1798, డబ్ల్యూ.జి.ఎల్ 44 రకాలను సాగు చేసి అధిక ఆదాయం పొందాలని రైతులకు సూచించారు.

యంగ్ ప్రొఫెషనల్ సల్మాన్ మాట్లాడుతూ నీటి నిర్వహణలో భాగంగా వరి సాగులో ఆల్టర్నేట్ వెట్టింగ్ అండ్ డ్రైయింగ్ పద్ధతిని అనుసరించి, సాగునీటిని ఆదా చేయవచ్చని, బిందు సేద్య పద్ధతులను అవలంబించి నీటిని సంరక్షి ంచాలని రైతులకు సూచించారు.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలన్నారు సహజ పద్ధతులను వినియోగించి రసాయన రహిత పంటలను పండించాలన్నారు. మండల వ్యవసాయ అధికారి డా. జి. పరిమళ మాట్లాడుతూ శాస్త్రవేత్తలు సూచించిన పద్ధతులను పాటించి ఆర్థికంగా ఎదగాలన్నారు ఈ కార్యక్రమంలో యంగ్ ప్రొఫెషనల్ కేశవ కృష్ణ, వ్యవసాయ విస్తరణ అధికారులు విశ్వనాథ్, వంశీకృష్ణ, భావన, చౌడాపూర్ గ్రామ సర్పంచ్ నవీన్, ఆత్మ కమిటీ సభ్యులు సలీం, మండల కాంగ్రెస్ ప్రెసిడెంట్ అశోక్, మాసయ్య, వెంకట్ నాయక్, రైతులు పాల్గొన్నారు.

# అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన

**శామీర్‌పేట, ఏప్రిల్ 27, ప్రభాతవార్త**


మజీద్‌పూర్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి, పాల్గొన్న కౌన్సిలర్లు, కమిషనర్, సిబ్బంది తదితరుల దృశ్యం

మజీద్‌పూర్ గ్రామంలో 10వ, 11వ వార్డులలో మున్సిపల్ నిధులు రూ.10లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కంతం శిరీషకృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం శామీర్‌పేట మండలంలోని అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని మజీద్‌పూర్ 10వ, 11వ వార్డులో మురికినీటి కాలువ సమస్యలు పరిష్కరించటానికి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి స్థానిక కౌన్సిలర్లు సరసం వనజఅశోక్‌రెడ్డి, సామల జశ్వంత్‌రెడ్డి, కమిషనర్ చంద్రశేఖర్‌లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ అభివృద్ధి కోసం కృషి జరుగుతుందని, వార్డులలో ఉన్న సమస్యలను దశలవారీగ పరిష్కరించటానికి కృషి చేస్తున్నట్లు, అభివృద్ధి పనులకు అందరు సహకరించాలని అన్నారు. మజీద్‌పూర్‌లో ఉన్న 10వ, 11వ వార్డులలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించటానికి మున్సిపల్ నిధులు 10లక్షల రూపాయలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం పనులు చేపడుతున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు తుంకి రమేశ్, కమిషనర్ చంద్రశేఖర్, కౌన్సిలర్లు ఎస్.వనజఅశోక్‌రెడ్డి, ఎస్.జశ్వంత్‌రెడ్డి, మాజీ సర్పంచు ఎల మల్లేశ్, ఎఇ సనా, బిసి సెల్ అధ్యక్షులు గిర్మాపూర్ నర్సింగ్‌రావుగౌడ్, 11వ వార్డు అధ్యక్షులు నాటకారి వెంకటయ్య, నాయకులు కె.కృష్ణారెడ్డి, ఎ.భాస్కర్‌గౌడ్, జగదీశ్వర్‌గౌడ్, వినోద్‌గౌడ్, మున్సిపల్ సిబ్బంది, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

## హింస ప్రవృత్తితో పరిష్కారం కాదు

షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి

**షాద్‌నగర్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త :** హింస ప్రవృత్తితో సమస్యలు పరిష్కారం కావని, సమాజంలో శాంతియుత వాతావరణంలో సమస్యలు పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉంటుందని షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి అన్నారు. శంషాబాద్ లిమ్స్ ప్రైవేట్ ఆస్పత్రిలో చౌదరిగూడ మండలం ఎలుకగూడెం గ్రామ సర్పంచ్ బందెయ్యను ప్రత్యేకంగా కలుసుకొని పరామర్శించారు. బందయ్య ఆరోగ్య పరిస్థితిని డాక్టర్ తో అడిగి తెలుసుకున్నారు. బందయ్య ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ.. రాజకీయ కక్ష కార్పన్యాలు ఉండకూడదని పచ్చని గ్రామాల్లో శాంతియుత వాతావరణం ఎంతో అవసరమని అన్నారు. గెలుపు ఓటములు సహజమని గెలిచినవారు అనుకోగా ఉండాలని ఓడిన వారు నిబద్దతగా నిజాయితీగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు.


బందయ్యను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి

సమాజంలో శాంతిని దూరం చేసుకుంటే అశాంతి ప్రేరేపించబడుతుందని ఇలాంటివి ప్రజలకు అక్కర్లేదని అన్నారు. దాడులు హింస ప్రవృత్తి మానుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే వెంటా వ్యక్తిగత సహాయ కార్యదర్శి శ్రీధర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## పెళ్లికి రావాలని ముఖ్యమంత్రికి ఆహ్వానం

**తలకొండపల్లి, ఏప్రిల్ 27 ,ప్రభాతవార్త:**



తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బిజెపి రాష్ట్ర నాయకులు తల్లోజు ఆచారి తమ కుమారుడి తల్లోజు భరత్ వివాహానికి రావాలని కోరుతూ సోమవారం నాడు ఆహ్వాన పత్రిక అందజేశారు. హైదరాబాదులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి పెళ్లి పత్రికను అందజేశారు. ఈనెల 30న తన కుమారుడి వివాహం జరుగుతున్నందున హాజరు కావాలని కోరుతూ సీఎంను ఆహ్వానించారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం


ఆర్థిక సహాయం అందజేస్తున్న నాయకులు

**తలకొండపల్లి ఏప్రిల్ 27, ప్రభాతవార్త;**

తలకొండపల్లి మండల పరిధిలోని జంగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన మీసాల జంగయ్య(65), అనేవృద్ధుడు సోమవారం నాడు మృతి చెందాడు. గ్రామ సర్పంచ్ మల్లేష్ మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం తెలిపారు. అనంతరం మాజీ ఎంపీపీ తిరుమని నిర్మల శ్రీశైలం గౌడ్ ద్వారా రూ.2వేలు, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ తన ట్రస్టు ద్వారా రూ.3వేలు మొత్తం ఐదువేల రూపాయలు ఆర్థిక సాయం సర్పంచ్ మల్లేష్ ఆధ్వర్యంలో మృతిని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మల్లేష్, టిఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులు మోహన్ రెడ్డి, నాయకులు జైపాల్ రెడ్డి తిరుమల్ యాదయ్య గౌడ్ రఘురాం గౌడ్ మల్లేష్ యాదిరెడ్డి తిరుపతయ్య సభ్యుల శేఖర్ గౌడ్ మీసాల మధు రమేష్ సుధాకర్ నరసయ్య నరసింహ నాయకులు జైపాల్ రెడ్డి తిరుమల్ యాదయ్య గౌడ్ రఘురాం గౌడ్ మల్లేష్ యాదిరెడ్డి తిరుపతయ్య సభ్యుల శేఖర్ గౌడ్ మీసాల మధు రమేష్ సుధాకర్ నరసయ్య నరసింహ తదితరులు పాల్గొన్నారు.


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్

## వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

**తలకొండపల్లి, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:**

తలకొండపల్లి మండల పరిధిలోని చుక్కాపూర్ గ్రామంలో సోమవారం నాడు వరి కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ మాకం వీరేశలింగం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాకం వీరేశలింగం ఈ మాట్లాడుతూ చుక్కాపూర్ గ్రామంలో వరి కొనుగోలు కేంద్రం ఏర్పాటు పట్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. రైతులు తాము పండించిన ధాన్యాన్ని ప్రైవేటు వ్యక్తులకు అమ్మి నష్టపోకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ఈ కొనుగోలు కేంద్రాల ద్వారా లాభాలు పొందాలన్నారు. రైతులు దళారులకు అమ్మి నష్టపోకుండా ప్రభుత్వం కేటాయించిన మద్దతు ధరకు వరి ధాన్యాన్ని రైతులు వరి ధాన్యాన్ని అమ్ముకోవాలని. ప్రైవేట్ వ్యక్తులను దళాలను నమ్మి మోసపోవద్దని ఆయన సూచించారు. ప్రభుత్వం కేటాయించిన మద్దతు ధరకు రైతులు అమ్ముకొని లాభాలు పొందాలని, మద్దతు ధరతోపాటు బోనస్ను అదనంగా లబ్ది పొందాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాకం వీరేశలింగం, గ్రామ కార్యదర్శి శేఖర్ వార్డు సభ్యులు శ్రీధర్ రెడ్డి విష్ణు ఏఈఓ లలిత సుస్మిత శశి రాములు విజయ స్వప్న లక్ష్మి ్మ శిరీష శివమ్మ పార్వతమ్మ గ్రామ రైతులు వెంకటయ్య దేశం నరేష్ రెడ్డి మహేష్ రెడ్డి శీను లక్ష్మ ్మమ్మ మల్లయ్య లక్నోమోని శీను బాల మల్లేష్ యాదగిరి నరసింహ తదితరులు ఉన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లతోనే సొంతింటి కల సాకారం


షాబాద్‌లో నూతన గృహప్రవేశాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య, మధుసూదన్ రెడ్డి

**షాబాద్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:** ఇందిరమ్మ ఇండ్లతోనే సొంతింటి కల సాకారమౌతుందని ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి అన్నారు. సోమవారం షాబాద్ లో లబ్దిదారులు గడ్డం శారదచంద్రయ్య నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్ రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, డిసిసి ప్రధానకార్యదర్శి కుమ్మరి చెన్నయ్యలతో కలిసి వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకా సీఎం రేవంత్రెడ్డి నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు ఇచ్చి వారి కళ్లలో ఆనందం చూశాడు అన్నారు. నిరుపేదల సొంతింటి కల నెరవేరుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం అని అన్నారు. పేద ప్రజల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకుఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రుణమాఫీ, రైతుభరోసా వంటివే కాకుండా ఎన్నికల్లో ఇయ్యని హామీలను సైతం అందజేస్తున్న సీఎం రేవత్ రెడ్డికే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు అశోక్, సబితాగోవర్ధన్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, నర్సిం హులు, మాజీ సర్పంచులు రవీందర్ నాయక్, శ్రీనివాస్ గౌడ్, జనార్దన్ రెడ్డి, మహేందర్ గౌడ్, ఉపసర్పంచ్ దండు రాహుల్ గుప్తా. నాయకులు అంజయ్య, గౌరీశ్వర్, విష్ణువర్ధన్ రెడ్డి, శ్రీనివాస్, కిషోర్, అశ్విని, గామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోల్ బంకుల్లో నో స్టాక్


షాబాద్‌లో బందు ఉన్న పెట్రోల్ బంక్

**షాబాద్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త :** షాబాద్ మండలంలో పెట్రోల్, డీజిల్ కొరత ఏర్పడింది. ప్రజలు తమ పనులు చేసుకోలేక రాకు పోకలు సాగించలేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మండలంలో 8 పెట్రోల్ బంకులు ఉండగా ఆదివారం రాత్రి నుండే నోస్టాక్ ఉంది. అధికారులు వెంటనే స్పందించి ఇందన సరపరను పునరుద్దరించాలని వినియోగదారులు కోరుతున్నారు.

# ఘనంగా బిఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**కడ్తాల్, ఏప్రిల్,27. ప్రభాతవార్త:** తెలంగాణ ప్రజల ఉద్యమ పార్టీ బీఆర్ఎస్ 26వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు కడ్తాల్ మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కడ్తాల్ బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు కదారి రామకృష్ణ మండల నాయకులతో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన నుంచి బంగారు తెలంగాణ నిర్మాణం వరకు కేసీఆర్ గారి సారథ్యంలో బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని, గుర్తు చేశారు. రాబోయే రోజులలో మళ్లీ ముఖ్యమంత్రి కేసీఆర్ అని వారన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా, మాజీ జెడ్పీటీసీ దశరథ్ నాయక్ మాజీ వైస్ ఎంపీపీ బావండ్లపల్లి ఆనంద్, సర్పంచ్ సేవ్య నాయక్, మాజీ సర్పంచ్ లక్ష్మి ్మ నరసింహ రెడ్డి, నాయకులు లచ్చిరాం నాయక్, లాయక్ అలీ, గణేష్ గౌడ్ పార్టీ శ్రేణులు అభిమానులు తదితరులు పాల్గొంటున్నారు.



**కుల్కచర్లలో ..**

**కుల్కచర్ల, ఏప్రిల్, 27 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర అవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా మండల కేంద్రంలోని బిఆర్ఎస్ నేతలు బిఆర్ఎస్ పార్టీ జెండాను ఎగరవేశారు. జై తెలంగాణ పెద్ద పెట్టున నినాదాలు చేశారు.



ఈ కార్యక్రమంలో ఎర్రగోవింద్ తాండ సర్పంచ్ రాజు, సీనియర్ నాయకులు బృంగి శ్రీశైలం, ప్రధానకార్యదర్శి నర్సింలు, వెంకటేష్, రుక్మద్దీన్, హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

**పోచారంలో...**

**ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 27, ప్రభాత వార్త:** పోచారం డివిజన్ పరిధిలోని నారపల్లిలో బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం పార్టీ పతాకాన్ని ఆ పార్టీ నాయకులు ఏగురవేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి, లక్ష్మణ్ నాయక్, దుర్గారాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



**జిల్లెడు చౌదరిగూడలో..**

**జిల్లెడు చౌదరిగూడ, ఏప్రిల్, 27 ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండల కేంద్రంలో సోమవారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని బిఆర్ఎస్ నాయకులు ఘనంగ జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో రాములు, వెంకటేష్.బాబురావు, సత్యప్రమోద్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

**బిఆర్ఎస్ హయంలోనే తెలంగాణ సస్యశ్యామలం**

**పెద్దేముల్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:** పదేళ్ళ బిఆర్ఎస్‌పార్టీ హయంలోనే తెలంగాణ సస్యశ్యామలంగా ఉందని, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో ప్రజలు ఆగమాగం అవుతున్నారని మండల బిఆర్ఎస్‌పార్టీ అధ్యక్షులు కోహీర్ శ్రీనివాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ డివై నర్సిములు, మాజీ సర్పంచ్ కిషన్‌రావు, బిఆర్ఎస్‌పార్టీ మండల ప్రధానకార్యదర్శి చాకలి రంగయ్య, మామిళ్ళ వెంకట్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

**వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వమే**

**ఆమనగల్లు, ఏప్రిల్27, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. అర్జున్‌రావు ఆమనగల్లు పట్టణంతోపాటు మంగళపల్లి, ఇతర గ్రామాలలో పర్యటించి అర్జున్‌రావు పార్టీ శ్రేణులతో కలిసి బిఆర్ఎస్ పార్టీ జెండాలను ఎగురవేశారు. కార్యక్రమంలో కోటపెద్దశ్రీను, గుత్తి బాలస్వామి, కమటం రాధమ్మవెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

**నందిగామలో బిఆర్ఎస్ జెండా ఎగరవేసిన గులాబీ బాస్**

**నందిగామ, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :** బిఆర్ ఎస్ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా సోమవారం నందిగామ మండల కేంద్రంలో ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నందిగామ మాజీ సర్పంచ్, ఆ పార్టీ గులాబీ బాస్ జిల్లెల్ల వెంకట్ రెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, మల్లేష్ ,రమేష్, ఎర్రగారి కృష్ణ, జాంగారి రాములు తదితరులు ఉన్నారు.

**అంబరాన్నంటిన సంబురాలు**

**కేశంపేట, ఏప్రిల్ 27, ప్రభాతవార్త :**

కేశంపేట మండల పరిధిలోని లేమామిడి గ్రామంలో బిఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలను ఆ పార్టీ నాయకులు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ మాజీ సర్పంచ్ అంజిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో బీఆర్ఎస్ జండాను ఎగరవేసి గౌరవవందనం చేశారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ఎస్ నాయకులు రాఘవేందర్, శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**గుండ్ల పోచంపల్లి డివిజన్ పరిధిలో ..**

**మేడ్చల్, ఏప్రిల్ 27. ప్రభాతవార్త :** గుండ్ల పోచంపల్లి డివిజన్ పరిధిలో బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుండ్ల పోచంపల్లి మాజీ సర్పంచ్ మద్దుల శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు అమరం జైపాల్ రెడ్డి, బాలరాజ్, హేమంత్ రెడ్డి, పెంటయ్య, మాజీ కో ఆప్షన్ సభ్యుడు దేవేందర్ ముదిరాజ్, నాయకులు జగన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సందీప్ రెడ్డి, శ్రీనివాస్ రాజు, హరి, శ్రీనివాస్, జనార్దన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, రాము యాదవ్, నర్సింగ్ యాదవ్, మధు, రమేష్, సత్తిరెడ్డి, మహేష్, ఇర్ఫాన్, యాదగిరి, రమేష్, విద్యాసాగర్, మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



**మేడ్చల్ డివిజన్‌లో..**

**మేడ్చల్, ఏప్రిల్ 27. ప్రభాతవార్త :** మేడ్చల్ డివిజన్‌లో బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆ పార్టీ నేతలు ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా మేడ్చల్ పట్టణంలో ఆ పార్టీ నేతలు బీఆర్ఎస్ జెండావిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు భాస్కర్ యాదవ్, రవి, నాగరాజు, అలీ, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**కేశవరంలో ...**

**శామీర్‌పేట, ఏప్రిల్ 27, ప్రభాతవార్త**

కేశవరం గ్రామంలో బిఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బిఆర్ఎస్ జెండాను కేశవరం గ్రామ బిఆర్ఎస్ అధ్యక్షులు కొంపల్లి భూమేశ్‌గౌడ్ ఆవిష్కరించారు. సోమవారం మూడుచింతలపల్లి మండలంలోని కేశవరం గ్రామంలో బిఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గులాబి శ్రేణులు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ జెండాను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు యు.బాల్‌రాంగౌడ్, రైతు సంఘం అధ్యక్షులు ఇంద్రసేనారెడ్డి, బొమ్మలపల్లి చిత్తారియాదవ్, కొంపల్లి వీరస్వామిగౌడ్, బొమ్మలపల్లి మైసయ్యయాదవ్, మాజీ వార్డు సభ్యులు శ్రీశైలంయాదవ్, మామిండ్ల వెంకటేశ్‌యాదవ్, తప్పెట్ల నవీన్, ఉడతల కృష్ణగౌడ్, గొలికర మోహన్, తదితరులు పాల్గొన్నారు.



**కొడంగల్‌లో...**

**కొడంగల్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:**

బీఆర్ఎస్ పార్టీ అవిర్భావ దినోత్సవ వేడుకలను ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మాజీ కౌన్సిలర్ మధుసుదన్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



**దౌల్తాబాద్ మండలంలో గులాబీ జెండా పండుగ**

**దౌల్తాబాద్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:**

భారత రాష్ట్ర సమితి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు దౌల్తాబాద్ మండల వ్యాప్తంగా సోమవారంరోజు అత్యంత వైభవంగా జరిగాయి. కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి ఆదేశానుసారం, మండల కమిటీ పిలుపు మేరకు మండలంలోని ఆయా గ్రామాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్య క్రమంలో మండల నాయకులు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**తలకొండపల్లిలో ..**

**తలకొండపల్లి ఏప్రిల్ 27, ప్రభాతవార్త;**

తలకొండపల్లి మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో సోమవారం నాడు బిఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో టిఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులు పెరుమాళ్ ఆంజనేయులు ఆధ్వర్యంలో జెండా ఎగరవేసి సీట్లు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో తలకొండపల్లి సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు కటికల శేఖర్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు,

**కోట్ల గొంతులను ఏకం చేసింది గులాబీ జెండా**

**షాబాద్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త :** కోట్లది గొంతులను ఏకం చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించేంతవరకు విశ్రమించకుండా ఉద్యమం చేపట్టిన గొప్ప పార్టీ బీఆర్ఎస్ అని, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో స్వరాష్ట్రాన్ని సాధించేంతవరకు విశ్రమించలేదని మాజీ జడ్పీటీసీ పట్నం అవినాష్ రెడ్డి అన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా షాబాద్లో గులాబి జెండాను ఎగరవేశారు.

ఈ కార్యక్రమంలో నాయకులు జడల రాజేందర్ గౌడ్, మతీన్ తదితరులు పాల్గొన్నారు.

### పార్టీ ఆవిర్భావదినోత్సవానికి రూ. 10 లక్షల విరాళం

**షాబాద్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త :** బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావదినోత్సవం సందర్భంగా జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పట్నం అవినాష్ రెడ్డి తనవంతు సహకారాన్ని అందిస్తున్నారు. పార్టీ కోసం రూ.10 లక్షల చెక్కును ఆయన సోమవారం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావుకు అందించారు. ఈ సందర్భంగా కేటీఆర్ అవినాష్రెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమం లో మాజీ మంత్రులు హరీష్‌రావు, తలసాని శ్రీనివాసయాదవ్, సబితాఇంద్రారెడ్డి, మండలి ప్రతిపక్షనేత మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, యువనాయకులు పట్లోళ్ల కార్తీక్ రెడ్డి ఉన్నారు.




ఉపాధిహామీ కూలీలకు ఓఆర్ఎస్ పాకెట్లు అందజేస్తున్న సర్పంచ్

## ఉపాధి హామీ కూలీలకు ఒఆర్ఎస్ పాకెట్లు అందజేత

**కుల్కచర్ల,ఏప్రిల్,27 ప్రభాతవార్త :** వలసల నివారణకు ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ గడ్డం వెంకటయ్య పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని పిరంపల్లి గ్రామంలో ఫిల్డ్అసిస్టెంట్ వెంకటయ్య స్థానిక నాయకులతో కలిసిఉపాధి హామీ కూలీలకు ఓఆర్ఎస్ పాకెట్లు అందజేశారు. ఈసందర్బంగా సర్పంచ్ గడ్డం వెంకటయ్య మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ ఉపాధిహామీ పనులను సద్వినియోగం చేసు కోవాలన్నారు. ఎండల పెరిగిపోవడంతో ఉదయం సమయంలోనే పనులు పూర్తి చేసుకోని ఇంటికి చేరుకోవాలని సూచించారు. పని ప్రదేశాల్లో తాగునీరు తప్పకుండా తీసుకెళ్లాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు జి. రమేష్, మురళీకృష్ణ, ఎఎన్ఎం రత్నమ్మ, ఆశ వర్కర్ సత్యమ్మ, వార్డు సభ్యులు శ్రీలత శ్రీశైలం, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

## అడపడచుల పెళ్లిళ్లకు అండగా ఉంటాం

**సర్పంచ్ దివ్య శంకర్ నాయక్**

**కుల్కచర్ల,ఏప్రిల్,27 ప్రభాతవార్త:** ప్రతి పేదింటి అడబిడ్డ పెళ్లికి అండగా ఉంటామని సర్పంచ్ దివ్య శంకర్ నాయక్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని బండమిది తాండ గ్రామ పంచాయతీలో సభంత్ సరిత వివాహనికి సర్పంచ్ దివ్య శంకర్ నాయక్ తన సొంత డబ్బుతో 50కిలోల సోన బియ్యం, 15 కేజిల వంట నూనె, మరియు రూ. వేయి రూపాయిలు అందజేశారు. ఈ సందర్బంగా సర్పంచ్ దివ్య శంకర్ నాయక్ మాటాడుతూ.. పేదింటి అడబిడ్డ పెళ్లికి ఎల్లప్పుడు అండగా ఉంటామని పేర్కొన్నారు. ఈ పథకం కొత్తగా ప్రవేశ పెట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాండ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


పెళ్లికి ఆర్థిక సాయం అందజేస్తున్న సర్పంచ్

## దోషులను వదిలిపెట్టేదిలేదు

**మాజి ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి**

**జిల్లెడు చౌదరిగూడ, ఏప్రిల్, 27 (ప్రభాతవార్త):** సర్పంచ్‌పై దాడి చేసిన దోషులు ఎంతటివారైన వదిలలిపెట్టేదిలేదని షాద్‌నగర్ మాజి ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లెడు చౌదరిగూడ మండల కేంద్రంలో సర్పంచ్ బందయ్యపై


సమావేశంలో మాట్లాడుతున్న మాజి ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి

జరిగిన దాడికి నిరసనసభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజి ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ పేద సర్పంచ్‌పై కొంతమంది కావాలని దాడి చేయడం హేయమైన చర్య అని అన్నారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, డైరెక్టర్ వెంకటనర్సింహారెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షురాలు శ్వేత చంద్రబాబగౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చలివేంద్రంపల్లి రాజు, కృష్ణారెడ్డి, సర్పంచ్‌లు చంద్రశేఖర్, జంగయ్య, రాంచంద్రయ్య, నర్సింహులు, చందునాయక్, నీలయ్య, స్వప్న, పునీత, సనాసలీమ్, కుమార్, నాయకులు అంజనేయులు, పురుశోత్తంరెడ్డి, జిత్తెందర్‌రెడ్డి, వడ్డె వెంకట్‌రాములు, అశోక్, నర్సింహులు, బాల్‌రాజు, రవి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## గోమాత సంరక్షణకు కఠిన చట్టాలను అమలు చేయాలి

**..హిందు వాహిని సభ్యులు రాము సాగర్**

**పెద్దేముల్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:** గోమాత సంరక్షణకు దేశవ్యాప్తంగా ఒకే విధమైన కఠిన చట్టాలను అమలు చేయాలని, గో సంరక్షణకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని హిందు వాహిని ప్రాంత సమాచార సేకరణ టోలి సభ్యులు నాడేపల్లి రాము సాగర్ డిమాండ్ చేశారు. గోమాత సంరక్షణకు చట్టబద్ధ రక్షణ కోరుతు మండలంలో భారీ సంతకాల సేకరణ చేపట్టి సోమవారం మండల తహసిల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్బంగా రాముసాగర్ మాట్లాడు తూ గోమాతాకు రాష్ట్ర మాతా లేదా జాతీయ దేవత హోదా ఇవ్వాలని అన్నారు. గోవుల అక్రమ రవాణా, వధపై కఠిన శిక్షలు విధించాలని, గో ఆధారిత సహజ వ్యవసాయం ప్రోత్సహించాలని అన్నారు. తెలంగాణలో గోవుల వధపై సంపూర్ణ నిషేదం అమలు చేయాలని అన్నారు. ప్రతి గ్రామ పంచాయతీ స్థాయిలోగోశాలలు ఏర్పాటు చేయాలని, గోవుల కోసం అంబులెన్స్ సేవలు, వైద్య సదుపాయాలు కల్పించాలని, పాఠశాలలో గో విజ్ఞానం భోధించాలని వినతిపత్రంలోపేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందు పరిషత్ సభ్యులు బస్వరాజ్, చాకలి శేఖర్, అశోక్, వేదాంతచారీ, చాకలి రవి, పరిపూర్ణచారి, బన్ని, శ్రీకాంత్, రాజు, అభి, వెంకటేష్, ఉమేష్, గోపాల్, బోయిని రాజు తదితరులు పాల్గొన్నారు.


తహసిల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న హిందువాహిని సభ్యులు

## గోమాత రక్షణ బోర్డు ఏర్పాటు చేయాలని ర్యాలి

**కొడంగల్,ఏప్రిల్ 27,ప్రభాతవార్త:**

కొడంగల్ పట్టణంలో గో ఆరాధన ఉద్యమంలో భాగంగా హిందువాహిని, హిందూ సంఘాలు, గో రక్షక సభ్యులు సోమవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. మహదేవుని ఆలయం నుంచి తహాశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహిం చారు. అనంతరం తహాశీల్దార్ రాంబాబుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్బంగా గో రక్షక సభ్యులు మాట్లాడుతూ గోమాత సంరక్షణకు కఠిన చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే దేశంలో గోవుల హత్యలు నిషేదించాలని, గోవును జాతీయ జంతుగా ప్రకటించాలని, గోవులకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ, గో రక్షణ బోర్డు ఏర్పాటు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదించారు.


తహాశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గో రక్షక సభ్యులు

## గోమాత సంరక్షణకు చట్టాలు అమలు చేయాలి

**మోమిన్‌పేట్, ఏప్రిల్ 27. ప్రభాతవార్త:** గోరక్షణ సమ్మాన్ కొరకై ప్రత్యేక చట్టం అమలు చేయాలని ప్రధానమంత్రి, రాష్ట్రపతి, ముఖ్యమంత్రి, గవర్నర్ లకు మోమిన్‌పేట మండల కేంద్రంతో పాటు వివిద గ్రామాల ప్రజల సంతకాలు సేకతో కూడిన వినతి పత్రాలను గో ఆరాధన ఉద్యమ కమిటి ఆద్వర్యంలో సోమవారం మోమిన్‌పేట మండల తహశిల్దార్ రవిందర్ కు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సంధర్బంగా వారు మాట్లాడుతు 27,04,2026, రోజున గో ఆరాధన దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలస్థాయి అధికారులు మొదలుకొని, జిల్లా కలెక్టర్, దేశ ప్రధాని, రాష్ట్రపతి, ముఖ్యమంత్రి, గవర్నర్ వరకు ఇట్టి విషయాన్ని తెలియజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గో ఆరాధన కమిటి నాయకులు శ్రీకాంత్ రెడ్డి, కోట్ర శ్రీనివాస్ గుప్త, మాణిక్‌రెడ్డి, నర్సింలు నాయి,(రాజు) అంజన్న, నారాయణ రెడ్డి, సంతోష్ ఆయా గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



తహాశిల్దార్‌కు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న గో ఆరాధన కమిటి.

# కన్నుల పండువగా వీరబ్రహ్మేంద్రస్వామి కళ్యాణం

**ఆమనగల్లు, ఏప్రిల్27, ప్రభాతవార్త:** ఆమనగల్లు పట్టణంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో సోమవారం శ్రీశ్రీశ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి గోవిందమాంబదేవి కళ్యాణాన్ని భక్తులు అత్యంత వైభవంగా జరుపుకున్నారు. కళ్యాణఘట్టాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు తల్లోజు విజయ్‌కృష్ణ పర్యవేక్షణలో జరిగిన కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. ఆలయాన్ని పచ్చని తోరణాలతో ముస్తాబు చేశారు. ఆలయం లోపల కళ్యాణ వేదికను ఏర్పాటు చేసి సంస్కృతి సంప్రదాయాలు చాటుతూ శాస్త్రోక్తతంగా పండితులు బ్రహ్మంగారి కళ్యాణం జరిపించగా, పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దోవిందమాంబదేవి మెడలో తాళిబొట్టు కట్టారు. జీలకర్ర, తలంబ్రాలు వంటి సంప్రదాయ ఘట్టాలు భక్తులను భక్తిపారవశంతో తన్మత్వానికి గురి చేశాయి. స్థానిక కౌన్సిలర్ మొక్తాల వెంకటయ్యదంపతులు ముఖ్య అతిథులుగా హాజరైనారు. వేడుకలకు హాజరైన భక్తులకు నిర్వహకులు కావలసిన ఏర్పాట్లు చేశారు. కళ్యాణోత్సవం సందర్భంగా ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకున్నాయి. కార్యక్రమంలో అర్చకులు నయనాచారి, తల్లోజు వెంకటయ్య, యాదగిరిచారి, మాధవాచారి, అశోక్‌చారి, పుల్లయ్యాచారి, చంద్రచారి, జంగయ్యాచారి, రామాంజనేయులు, వైష్ణవి, రమాదేవి, కవిత, స్వప్న తదితరులు ఉన్నారు.


కళ్యాణానికి హాజరైన కౌన్సిలర్ వెంకటయ్య దంపతులను సన్మానిస్తున్న నిర్వహకులు

# రంగనాథ స్వామి దేవాలయ వార్షికోత్సవాలు ప్రారంభం

**దేవాదాయ కమిటీ చైర్‌పర్సన్‌గా నర్రీ మంజుల నియమాకం నూతన సభ్యులచే పదవీ ప్రమాణం చేయించిన అధికారులు**

**ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 27, ప్రభాత వార్త:** పోచారం డివిజన్ యంనంపేట్‌లోని రంగనాథ స్వామి ఆలయ 18 వ వార్షికోత్సవ వేడుకలు సోమవారం అట్టహాసంగా ప్రారంభమైనాయి. ఆలయ వార్షి కోత్సవ వేడుకల్లో భాగంగా విష్ణు సహస్ర నామ సోత్రపారాయణం, విష్వక్సేన ఆరాధన వాసుదేవ పుణ్యాహవాచనం, రక్షబంధనం, మృత్సంగ్రహణం, అంకురారోపణం, వైనతేయ అధివాసము, బలిపీఠాలకు పంచగవ్య ప్రోక్షణ తదితర పూజలు నిర్వహించినట్లు ఆలయ ఈవో లగడపాటి భాగ్యలక్ష్మీ తెలిపారు.

**ఆలయ కమిటీ డైరక్టర్లచే పదవీ ప్రమాణస్వీకారం చేయించిన దేవాదాయ ఇన్‌సెక్టర్**

రంగనాథ స్వామి ఆలయ కమిటీ చైర్‌పర్సన్‌గా నర్రీ మంజుల, కమిటీ డైరక్టర్లుగా నల్లరాళ్ల శ్రీలత రెడ్డి, పి. లక్ష్మణ్, పి. మమత, పి. శ్రీహరి, ఎం. సుబాశ్, ఎన్. బాస్కర్‌లచే దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ప్రణీత్ పదవీ ప్రమాణస్వీకారం చేయించారు. ఆలయ ఈవో ఎల్. భాగ్యలక్ష్మీ తదితరులున్నారు. ఆలయ కమిటీ పదవీ ప్రమాణం చేసిన సభ్యులను డీసీసీ ఉపాధ్యక్షుడు వేముల మహేశ్ గౌడ్, పోచారం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కర్రె రాజేశ్, నాయకులు పి. రాములు, శ్రావణ్ గౌడ్, సహదేవ్ గౌడ్, రామకృష్ణా రెడ్డి, నర్రీ శ్రీశైలం, మెట్టు గణేశ్ యాదవ్, సగ్గు శ్రీనివాస్ తదితరులు పాల్గొని నూతన కమిటీ సభ్యులను అభినందించారు.


యంనంపేట్ శ్రీ రంగనాథ స్వామి దేవాలయ నూతన కమిటీ సభ్యులచే పదవీ ప్రమాణం చేయిస్తున్న దేవాదాయ ఇన్‌స్పెక్టర్ ప్రణీత్ తదితరులు.

# గ్రాడ్యుయేషన్ డేలో అలరించిన చిన్నారుల ఆటపాట


తాటిగడ్డ తండాలో చిన్నారుల గ్రాడ్యుయేషన్ డే వేడుకల దృశ్యం


గొల్ల గూడ అంగన్వాడీ కేంద్రాల్లో సర్పంచ్, టీచర్, చిన్నారుల తల్లిదండ్రులు

**నందిగామ, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :** నందిగామ మండలం సిడి తాండ గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న తాటిగడ్డ లోని బాలవికాస కేంద్రంలో చిన్నారి బాలబాలికల గ్రాడ్యుయేషన్ వేడుకలు చూపరులను ఆకట్టుకున్నాయి. బుడిబుడి అడుగులతో.. వచ్చిరాని మాటలతో.. చిన్నారి బాలబాలికలు చేసిన విన్యాసాలు అద్భుతం. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నాట్కో ట్రస్ట్ ప్రతినిధి వెంకట్ సాయి హాజరయ్యారు. చదువు ద్వారానే దేశాభివృద్ధి సాధ్యమని, రెండు సంవత్సరాలు దాటిన చిన్నారి బాల బాలికలను బాల వికాస కేంద్రంలో, ఐదు సంవత్సరాల నిండిన విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. విద్యార్థుల చదువుల కోసం నాట్కో ట్రస్ట్ ద్వార ఆర్థిక సాయం అందించేందుకు వెనకాడ బోమన్నారు.

ఈ కార్యక్రమంలో అంగన్వాడి ఉపాధ్యాయురాలు అమ్రమాల, ఒకటవ వార్డ్ సభ్యులు రాజేష్, మాధవి, గ్రామ యువ నాయకుడు జటావత్ పాండునాయక్, సిడి తండా కారోబార్ జటావత్ శ్రీను నాయక్, పరశురాం, ఉపాధ్యాయులు జ్యోతి, స్వప్న, కావేరి, టిఎస్టి నాగమణి, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు ఉన్నారు.

**గొల్లగూడ అంగన్వాడిలో ..**

**యాచారం,ఏప్రిల్ 27, ప్రభాతవార్త:**

యాచారం మండల పరిధిలోని తాడిపర్తి అనుబంధ గ్రామమైన గొల్ల గూడ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ ధార రమణ, సర్పంచ్ నీలం ఝాన్సీ రమేష్ ఆధ్వర్యంలో అంగన్వాడీలో విద్య వార్షిక సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా సర్టిఫికెట్ ప్రధానం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఝాన్సీరమేష్ మాట్లాడుతూ.. అంగన్వాడి కేంద్రాలలో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా చిత్తశుద్ధితో విద్యాబుద్ధులు బోధించిన రమణను కొనియాడారు. విద్యార్థులకు బాల్యంలో ప్రవేటు పాఠశాలలో చైల్డ్ కేర్ సెంటర్లలో లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నా సందర్భంలో ప్రైవేటుకు ధీటుగా అంగన్వాడి కేంద్రాలలో విద్యాబుద్ధులు బోధించి క్రమశిక్షణ నేర్పించడం ఎంతో గొప్ప విషయం అన్నారు. అంగన్వాడీల బలోపేతానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని పేర్కొన్నారు.

# విద్యార్థులకు టాలెంట్ సెర్చ్ టెస్ట్‌ను నిర్వహించడం హర్షణీయం

**..ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి**

**యాలాల, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:** యాలాల మండలంలోని 53 పాఠశాలలో సుమారు 600 మంది విద్యార్థులకు టాలెంట్ సర్చ్ టెస్ట్‌ను నిర్వహించడం హర్షనీయమని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషించిన యాలాల యంఈఓ మహిపాల్‌రెడ్డిని సోమవారం తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి క్యాంపు కార్యాలయానికి ఆహ్వానించి సన్మానించారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జూన్ నెలలో తాండూరు నియోజకవర్గ స్థాయిలో టాలెంట్ సర్చ్ టెస్ట్ నిర్వహించాలని సంబందిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో క్రిష్ణరెడ్డి, రాములు, పిఆర్‌టియు నాయకులు విజయ్ టిసిఆర్ అగ్గనూర్, జి. నర్సి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


యంఈఓను అభినందిస్తున్న ఎమ్మెల్యే

# ప్రభుత్వ పాఠశాలలను ప్రోత్సహించేందుకు పల్లె బ్రదర్స్ చేయూత



**కేశంపేట, ఏప్రిల్ 27, ప్రభాతవార్త :**

ప్రభుత్వ పాఠశాలల్లోనే అనుభవాజ్ఞులైన ఉపాధ్యాయ బృందం చే నాణ్యమైన విద్య లభిస్తుందని ప్రభుత్వ పాఠశాలల్లో చదువు కుంటున్న విద్యార్థులకు ప్రోత్సాహం అందించి, గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి చేయూతనివ్వాలనే మహత్తర సంకల్పంతో కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన పల్లె బ్రదర్స్ అయినా పల్లె ఆనంద్ కుమార్, పల్లె బాలేశ్వర్‌లు ఆదర్శప్రాయమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కేశంపేట మండలంలోని కొండారెడ్డిపల్లి గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదువుతున్న మొత్తం 76 మంది విద్యార్థిని, విద్యార్థులకు తమ సొంత నిధులతో ఉచితంగా సైకిళ్లు అందజేయనున్నట్లు భారత్ తెలిపారు . ఈ సేవా కార్యక్రమాన్ని నేడు మంగళవారం ఉదయం 10 గంటలకు పాఠశాల ప్రాంగణంలో స్థానిక శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్ చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్బంగా పల్లె బ్రదర్స్ మాట్లాడుతూ విద్యార్థులు, పాఠశాలకు సులభంగా చేరుకోవడం, శారీరక దృఢత్వం పెరగడం, మానసిక ఉల్లాసం కలగడం వంటి అనేక ప్రయోజనాలు సైకిళ్ల ద్వారా లభిస్తాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని నమ్మకం పెంపొందించేందుకు, పేద మరియు మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులకు ప్రోత్సాహం అందించేందుకు, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తమ వంతు బాధ్యతగా ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టినట్లు పల్లె బ్రదర్స్ పేర్కొన్నారు. ప్రభుత్వ విద్య బలోపేతం అయితేనే సమాజ భవిష్యత్తు బలపడుతుందని వారు తెలిపారు. పల్లె బ్రదర్స్ చేస్తున్న ఈ సేవా కార్యక్రమం గ్రామ ప్రజలలో, విద్యార్థుల తల్లిదండ్రుల్లో, ఉపాధ్యాయ వర్గాల్లో ఆనందాన్ని నింపింది. నిస్వార్థంతో సేవా భావంతో ముందుకు వస్తున్న యువతకు ఇది ఆదర్శంగా నిలుస్తుందని గ్రామస్తులు పలువురు కొనియాడారు. పల్లె బ్రదర్స్ గ్రామానికి చేస్తున్న అనేక సేవలు ఎందరికో స్ఫూర్తిదాయకమని ఇలాంటి గొప్ప నాయకులు మా గ్రామంలో పుట్టడం మా అదృష్టంగా భావిస్తున్నామని గ్రామస్తులు కొనియాడారు.

# స్వామి వారి కృపతో ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలి

**షాద్‌నగర్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త :** పట్టణంలోని పరిగి రోడ్డులో గల శ్రీ రమా సత్యనారాయణ స్వామి దేవాలయంలో నిర్వహించిన ఉత్సవాలలో షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు . ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనను ఘనంగా సన్మానించారు. సత్యనారాయణ స్వామి అనుగ్రహంతో ప్రజలందరూ సుఖశాంతులతో ఉంటారని ఆయన అన్నారు. దేవాలయంలో చేపడుతున్న ఆధ్యాత్మిక శోభ ఎంతో ఆనందాన్ని కలిగిస్తుందని వివరించారు . ఈ కార్యక్రమంలో పురపాలిక చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్, కౌన్సిలర్లు పెంటయ్య, అప్పి, కొత్తూరు మాజీ ఎంపీపీ శివ శంకర్ గౌడ్ కొమ్ము కృష్ణ కుమారస్వామి గౌడ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేను ఆశీర్వదిస్తున్న అర్చకులు


సమావేశంలో మాట్లాడుతున్న కాలెమల్లయ్య

## అంబేద్కర్ యువజన సంఘం కొత్త కమిటీకి ఆమోదం లేదు

**-కాలె మల్లయ్య, వస్పుల సాయిలు**

**ఆమనగల్లు, ఏప్రిల్27, ప్రభాతవార్త:** ఆమనగల్లు అంబేద్కర్ యువజన సంఘం నూతన కమిటీ పేరుతో కొంతమంది దుష్ప్రచారం చేసుకుంటున్నారని, ఈప్రచారాన్ని ప్రజలు విశ్వసించకూడదని సంఘం గౌరవ సభ్యులు కాలె మల్లయ్య, వస్పుల సాయిలు అన్నారు. ఒగ్గు మహేశ్ అధ్యక్షతన ఉన్న ప్రస్తుత కమిటీ యథావిధిగా కొనసాగుతుందని, అది అలా ఉండగానే కొత్త కమిటీని ఎన్నుకోవడం ఎంతవరకు న్యాయమని వారు ప్రశ్నించారు. ఎటువంటి తీర్మానాలు లేకుండానే కొంతమంది ఉద్దేశపూర్వకంగా సంఘం నూతన కమిటీలను ఎనుకున్నట్లు ప్రచారం చేయడం సరికాదని వారు అన్నారు. సోమవారం కాలెమల్లయ్య, వస్పుల సాయిలు స్థానిక విలేకరులకు పత్రిక ప్రకటన విడుదల చేశారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ పేరిట దశాబ్దాల క్రితం యువజన సంఘం ఏర్పాటు చేసి పలు సేవా కార్యక్రమాలతో ప్రజల్లో సుస్థిర విశ్వాసాన్ని పెంపొందించినట్లు వారు తెలిపారు. సంఘం ఏర్పాటుకు నియమ నిబంధనలు రూపొందించి అందుకను గుణంగా అన్ని కులాలకు మతాలకు ప్రాధాన్యతనిస్తూ ఇప్పటి వరకు కమిటీలు ఎన్నుకుంటున్నట్లు వారు తెలిపారు. అదే ప్రక్రియ ముందు ముందు కొనసాగుతుందని చెప్పారు. అలాగే త్వరలోనే అంబేద్కర్ యువజన సంఘం సభ్యత్వాల నమోదును ప్రారంభించ బోతున్నట్లు వారు పేర్కొన్నారు. సభ్యత్వాల నమోదు ప్రక్రియ పూర్తి అయిన తరువాత అందరి సమక్షంలో నూతన కమిటీ ఎన్నికలు నిర్వహిస్తామని కాలె మల్లయ్య, వస్పుల మానయ్య తెలిపారు. ప్రజామోదంతో ఎన్నికైన ప్రస్తుత ఒగ్గు మహేశ్ అధ్యక్షత కమిటీనే అంబేద్కర్ యువజన సంఘంగా పరిగణిస్తున్నట్లు వివరించారు. అంబేద్కర్ యువజన సంఘంను అభాసుపాలు చేయడానికి కుట్రలు చేస్తే చూస్తూ ఊరుకునే ప్రసక్తేలేదని మల్లయ్య, వస్పుల సాయిలు తెలిపారు. కార్యక్రమంలో నరేందర్, రేవల్లిరాజు, దర్శన్, కృష్ణ, మీసాల శంకర్, శివ, శ్రీను, జగన్, మధన్, మహేశ్, కృష్ణ, జంగయ్య తదితరులు ఉన్నారు.

## మృతుడి కుటుంబానికి పరామర్శ

**గాయపడిన వ్యక్తికి ఆర్థిక సాయం**

**మాడ్గుల,ఏప్రిల్27,ప్రభాతవార్త:** ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తూ ఆర్కపల్లి గ్రామ సర్పంచ్ కళ్ల భాగ్యలక్ష్మి తిరుపతి రెడ్డి సేవాభావాన్ని చాటుకున్నారు. గ్రామానికి చెందిన తోలు ఏల్చన్ మరణించిన విషయం తెలుసుకున్న సర్పంచ్, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 3వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ధైర్యం చెప్పారు. అలాగే గ్రామ ప్రజా ప్రతినిధులు కూడా తమ వంతు సహాయం అందించారు. 4వ వార్డు సభ్యుడు ఎస్‌కే జానీ వేయి, 9వ వార్డు సభ్యుడు యాచారపు అరవింద్ గౌడ్ వేయి రూపాయల చొప్పున సహాయం అందించి కుటుంబానికి భరోసా కల్పించారు. అనంతరం ఇటీవల ప్రమాదవశాత్తు లారీ ఎక్కుతుండగా క్రిందపడి చేయి విరిగి చికిత్స అనంతరం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన తోలు యాదయ్య కుటుంబాన్ని సర్పంచ్ పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. బాధిత కుటుంబానికి ధైర్యం చెబుతూ గ్రామ ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ తోలు రవీందర్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు పాల్గొని బాధిత కుటుంబాలకు సంఘీభావం తెలిపారు. గ్రామంలో ఎవరికి ఏ కష్టం వచ్చినా ముందుండి ఆదుకుంటూ సర్పంచ్ కళ్ల భాగ్యలక్ష్మి తిరుపతి రెడ్డి సేవా కార్యక్రమాలు కొనసాగించడం అభినందనీయమని గ్రామస్తులు కొనియాడుతున్నారు.


ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు
బాధిత కుటుంబాలకు అండగా సర్పంచ్ కళ్లు



## నిర్దవెల్లిలో జాతీయ ఉపాధి హామీ పనులు ప్రారంభం

**ఉప సర్పంచ్ అమీర్**

**కేశంపేట, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:**

కేశంపేట మండల పరిధిలోని నిర్దవెల్లి గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామంలో పీర్లకొట్టం నుండి కాకునూరు శివారు వరకు మట్టి రోడ్డు పనులను గ్రామ ఉప సర్పంచ్ సపూరా ఆమేర్ ప్రారంభించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ జాతీయ ఉపాధి హామీ పనులలో జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని అన్నారు ఈ ఈ పనుల్లో దాదాపు 70 మంది ఉపాధి హామీ కూలీలు పాల్గొని పనులను ప్రారంభించారని గ్రామాభివృద్ధి దిశగా ఈ పనులు ఎంతగానో ఉపయోగపడతాయని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయ్ కుమార్, వార్డుసభ్యులు నాగరాజు, చంద్రయ్య, రమేష్ నాయక్, చెన్నయ్య, రిజ్వానబేగం మోహిజ్, మంజుల జంగేశ్, ఫీల్డ్ అసిస్టెంట్ జంగయ్య, నాయకులు మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఏకలవ్య ఎరుకల సంఘం అధ్యక్షులుగా బిక్షపతి

**-సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక**

**ఘట్‌కేసర్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మండల ఏకలవ్య ఎరుకల సంఘం నూతన అధ్యక్షులుగా బిజిలి బిక్షపతి ఎన్నిక అయ్యారు. ఘట్‌కేసర్ డివిజన్ శ్రీగట్టుమైసమ్మగుట్ట వద్ద జరిగిన సంఘం సమావేశంలో ఎరుకల నాయకులు, సభ్యులు, యువకులు హాజరై అందరి ఆమోదంతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షులుగా బిజిలి బిక్షపతి, ప్రధాన కార్యదర్శిగా బిజిలి నరసింహ, కోశాధికారిగా కుతాడి సారయ్యలను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఎన్నికల అధికారిగా కుతాడి బిక్షపతి, బిజిలి మైసయ్య వ్యవహరించగా బిజిలలి నరసింహ అధ్యక్షతన ఎన్నికలు నిర్వహించారు. ఈసందర్బంగా నూతన అధ్యక్షులు బిక్షపతి మాట్లాడుతూ సంఘం బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. అందరి సహకారంతో కుల సంఘ సభ్యుల సంక్షేమం కోసం పాటుపడతానని పేర్కొన్నారు. తనకు అధ్యక్ష పదవి ఇచ్చినందుకు ఆయన అందరికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈసందర్బంగా సభ్యులు నూతన కార్యవర్గాన్ని శాలువా, పూలదండలతో సన్మానించారు.

